# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 190 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 05 ఆగస్టు 2026

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## రెండేళ్ల పాలనపై ప్రగతి నివేదిక..

**రెండేళ్ల పాలనపై ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ ప్రొగ్రెస్ రిపోర్ట్ విడుదల చేసిన సీఎం**

**2019-24 మధ్య గత ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శ**

**నిశ్శబ్ద విప్లవంతో ప్రజలు 57 శాతం ఓట్లతో తమను గెలిపించారని వెల్లడి**

**గత పాలనలో ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ.. పారిశ్రామికవేత్తలు పారిపోయారని ఆరోపణ**

**ఉత్తరాంధ్రలో ఇరిగేషన్, స్టీల్, ఐటీ, ఫార్మా రంగాలను అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ**



**అమరావతి,మన జనప్రగతి ఆగస్ట్ 04:** తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'ప్రొగ్రెస్ రిపోర్ట్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 2019-24 మధ్య కాలంలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని, దాని ప్రభావం నుంచి ఇంకా కోలుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా 2లో...

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**'అమరజీవి జలధార' గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు పరిష్కారం: పవన్ కల్యాణ్**

**జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు**

**తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం**

**నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్**

**అమరావతి,మన జనప్రగతి ఆగస్ట్ 04:** జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ ప్రాజెక్టు మిగతా 2లో...

## ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్ బెయిల్

**త్రిషపై వివాదాస్పద వ్యాఖ్యల దుమారం..**



**ఉదయనిధి స్టాలిన్‌పై ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు**

**ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టుకు వెళ్లిన డీఎంకే నేత**

**విచారణకు వచ్చే లోపే అరెస్ట్ చేసిన పోలీసులు**

**ఉదయనిధి వ్యాఖ్యలపై టీవీకే, బీజేపీ తీవ్ర విమర్శలు.**

**త్రిషకు క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**వివాదం రాజకీయ ప్రేరేపితమని డీఎంకే వాదన**

**చెన్నై,మన జనప్రగతి ఆగస్ట్ 04:** తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని సృష్టిస్తున్నాయి. ఈ విషయంలో పోలీసులు ఇప్పటికే ఆయన్ను అరెస్ట్ చేశారు. చెన్నైలో ఆయన నివాసానికి పెద్ద ఎత్తున చేరుకున్న డీఎంకే కార్యకర్తలు పోలీసు వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆరు సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు సమాచారం. మరోవైపు అరెస్టు నుంచి రక్షణ కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఉదయనిధి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అది విచారణకు వచ్చేలోపే ఆయన్ను అరెస్ట్ చేయడం గమనార్హం. మిగతా 2లో...

## మెగా డీఎస్సీ-2025 పిటిషన్ పై విచారణ మూడు వారాలకు వాయిదా

**మెగా డీఎస్సీ-2025పై సీబీఐ విచారణ కోరుతూ హైకోర్టులో పిల్**

**క్రీడా కోటా నిబంధనలు మార్చి కొందరికి లబ్ధి చేకూర్చారని ఆరోపణ**

**అనర్హమైన స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో నియామకాలు జరిగాయన్న పిటిషనర్**



**అమరావతి,మన జనప్రగతి ఆగస్ట్ 04:** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియామకాల కోసం చేపట్టిన మెగా డీఎస్సీ-2025 ప్రక్రియలో భారీగా అక్రమాలు జరిగాయని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు మిగతా 2లో...




## పోటెత్తుతున్న వరద..

**వేగంగా నిండుతున్న శ్రీశైలం డ్యామ్**

**ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మకు పోటెత్తుతున్న వరద**

**నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 900 క్యూసెక్కులు**

## గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..

**15 ఏళ్లలోపు పిల్లలకు ఎక్కువ ప్రమాదం**

**జ్వరం తర్వాత మెదడుపై దాడి చేసే అవకాశం**

**టీకా, ప్రత్యేక మందు ప్రస్తుతం లేవు**

**లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి**

**కీటకాల నుంచి రక్షణే ప్రధాన నివారణ**




## పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

**25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం**

**13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు**

**కల్తీ మసాలాలలో క్యాన్సర్ వంటి ప్రమాదాలు**

**కల్తీలపై సిట్ ద్వారా దర్యాప్తు చేపడతాం**

**ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు**

**నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి**




**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్ట్ 04:** ఆహార కల్తీకి పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్-ఫాస్ట్ అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి పెద్ద ఎత్తున మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టి 25 టన్నుల కల్తీ మసాలా దినుసులు స్వాధీనం చేసుకున్నట్టు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి.. 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు, 89.15 టన్నుల ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. మిగతా 2లో...

## జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

### పార్లమెంట్‌లో బిల్లుకు ఆమోదం!

**ఆలస్యంగా చేసే రిజిస్ట్రేషన్లకు కఠినమైన నిబంధనలు**

**రెండేళ్లు దాటితే జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు అవసరం**

**దేశంలో 99 శాతానికి పైగా పెరిగిన జనన, మరణాల నమోదు**

**గుర్తింపు మోసాలను అరికట్టడమే లక్ష్యమని తెలిపిన కేంద్రం**



**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్ట్ 04:** దేశంలో జనన మరణాల నమోదు ప్రక్రియను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు మంగళవారం రాజ్యసభ ఆమోదం తెలిపింది. మిగతా 2లో...

## ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

**ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం**



**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్ట్ 04:** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-÷బైర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. మిగతా 2లో...

## అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**ప్రత్యేక వైద్యసేవలు అందక ప్రజల ఇక్కట్లు**

**కమిషనర్ లేక గాలిలో దీపంలా వైద్యవిధాన పరిషత్**

**సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు**



**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్ట్ 04:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక మిగతా 2లో...

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
05- 08 - 2026

# మెగా డీఎస్సీ-2025 పిటిషన్ పై విచారణ మూడు వారాలకు వాయిదా

**మొదటి పేజీ తరువాయి**

మంగళవారం విచారణ చేపట్టింది. ఈ నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలు కేవలం కొన్ని పొరపాట్లు కావని, ఇది వ్యవస్థీకృత వైఫల్యమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు.

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది, రాష్ట్ర మాజీ అడ్వొకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్ సుబ్రహ్మణ్యం వాదనలు వినిపించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు కొద్ది రోజుల ముందు ప్రభుత్వం క్రీడా కోటా విధానంలో కీలక మార్పులు చేసిందని శ్రీరామ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. క్రీడా కోటా రిజర్వేషన్లను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచారని, ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలన్న నిబంధనను కూడా తొలగించారని తెలిపారు. ఈ మార్పుల ద్వారా ముందుగా నిర్ణయించుకున్న కొందరు అభ్యర్థులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా పారదర్శకత లేకుండా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. అర్హత లేని స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ఆధారంగా పలువురు అభ్యర్థులు నియామకాలు పొందారని, దీనికి సంబంధించిన కొన్ని నమూనా సర్టిఫికెట్లను ఆయన కోర్టు ముందు ఉంచారు. గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు బదులుగా, కేవలం స్థానిక పోటీల్లో పాల్గొన్న సర్టిఫికెట్లను ఉపయోగించారని వాదించారు. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం క్రీడా కోటాకు సంబంధించిన జీవోలను వెనక్కి తీసుకుందని, ఈ చర్యే విధానపరమైన మార్పులపై తీవ్ర అనుమానాలకు తావిస్తోందని, కాబట్టి స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా తాము చాలా సమాచారాన్ని సేకరించామని, ప్రభుత్వం పూర్తి మెరిట్ జాబితాను ప్రచురించనందున కొన్ని ఉదాహరణలను మాత్రమే కోర్టు ముందు ఉంచగలిగామని వివరించారు. ప్రభుత్వ చర్యలకు, బెదిరింపులకు భయపడి చాలా మంది బాధితులు కోర్టును ఆశ్రయించడం లేదని కూడా ఆయన తెలిపారు. ఈ అంశం వేలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించినది కాబట్టి, వ్యవస్థీకృత లోపాలను సరిదిద్దడానికి ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారానే దర్యాప్తు కోరుతున్నామని స్పష్టం చేశారు. వాదనలు విన్న హైకోర్టు, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

# రెండేళ్ల పాలనపై సీఎం చంద్రబాబు ప్రగతి నివేదిక..

**మొదటి పేజీ తరువాయి**

గత ప్రభుత్వ అణచివేత, వేధింపుల కారణంగానే ప్రజలు నిశ్శబ్ద విప్లవం ద్వారా తమకు చారిత్రాత్మక విజయాన్ని అందించారని చంద్రబాబు అన్నారు. "మా కూటమికి 57 శాతం ఓట్లు, 94 శాతం స్ట్రైక్ రేటుతో ప్రజలు బ్రహ్మాండమైన తీర్పు ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేశాక ఏడు కీలక శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేసి వాస్తవ పరిస్థితిని ప్రజల ముందు ఉంచాం. ఇప్పుడు రెండేళ్ల పాలన తర్వాత ఆర్థిక స్థితిగతులపై ఈ ప్రగతి నివేదిక ఇస్తున్నాం" అని ఆయన తెలిపారు. 2019–24 మధ్య కాలంలో రాష్ట్రంలో కేవలం విధ్వంసమే జరిగిందని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. "అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. ప్రజలు, అధికారులు, చివరకు పోలీసులు కూడా భయంతో బతికే పరిస్థితిని కల్పించారు. ఏపీ బ్రాండ్‌ను దారుణంగా దెబ్బతీయడంతో ఇతర ప్రాంతాల్లో ఏపీ వాసులను చిన్నచూపు చూసే దుస్థితి ఏర్పడింది. పారిశ్రామికవేత్తలు తమ కంపెనీలను ఇక్కడ పెట్టబోమని చెప్పి పారిపోయిన పరిస్థితులను చూశాం" అని ఆయన ఆరోపించారు. 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని కూడా లేకుండా, బస్సులో బస చేసి పాలన సాగించామని గుర్తుచేశారు. ఆ నష్టాల నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెడుతుంటే, గత ఐదేళ్లలో అంతకుమించిన నష్టం జరిగిందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి నడిపిస్తున్నామని, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో ఇరిగేషన్, స్టీల్, ఏఐ, ఐటీ, ఫార్మా వంటి కీలక రంగాలపై దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు.

# పోటెత్తుతున్న వరద..

**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్ట్ 04:**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి కృష్ణా నది వరద ప్రవాహం పోటెత్తుతోంది. ఐదు రోజుల క్రితం ప్రవాహం ప్రారంభమైన సమయంలో 820 అడుగులుగా ఉన్న నీటిమట్టం, నిన్న సాయంత్రానికి 855.10 అడుగులకు చేరింది. ప్రస్తుతం డ్యామ్‌లో 92.048 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈ సాయంత్రానికి ఈ నిల్వలు 100 టీఎంసీల మార్కును దాటుతాయని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీశైలం జలాశయం: జూరాల నుంచి సోమవారం 2.21 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, రాత్రి సమయానికి శ్రీశైలానికి 1.55 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. రోజుకు లక్ష క్యూసెక్కులకు పైగా వచ్చే ఈ వరద ఉద్ధృతి మరో నాలుగైదు రోజులు కొనసాగవచ్చని శ్రీశైలం డ్యామ్ సీఈ కబీర్ బాషా తెలిపారు. ఎగువ కర్ణాటక ప్రాజెక్టులు: ఆలమట్టి డ్యామ్‌లోకి 1,25,855 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 1.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టులోకి 1,28,954 క్యూసెక్కులు వస్తుండగా, 1,40,880 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ... తుంగభద్ర: నారాయణపూర్ నుంచి వస్తున్న నీటికి భీమా నది వరద జలాలు తోడవడంతో జూరాలకు ఏకంగా 1.92 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకొని జూరాల నుంచి 2,21,765 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర డ్యామ్‌లోకి 57,785 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 136 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఎగువ నుంచి 900 క్యూసెక్కులు వస్తున్నాయి. పులిచింతలలో 28.91 టీఎంసీల నీటినిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజీలోకి 6,958 క్యూసెక్కులు చేరుతుండగా, 6,499 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

# ఉదయనిధి స్టాలిన్ అరెస్ట్ బెయిల్

**మొదటి పేజీ తరువాయి**

కావేరి జలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఉదయనిధి నిన్న ప్రసంగించారు. ఆ సమయంలో సభలో ఉన్న ఓ వ్యక్తి నటి త్రిష పేరు ప్రస్తావించగా, దానికి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు ద్వంద్వార్థంతో ఉన్నాయని విమర్శలు వచ్చాయి. మహిళలను అవమానించేలా ఆ వ్యాఖ్యలు ఉన్నాయని ప్రత్యర్థి పార్టీలు ఆరోపించాయి. అధికార టీవీకే పార్టీ నేత ఆధవ్ అర్జున్ ఉదయనిధిపై తీవ్ర విమర్శలు చేశారు. మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. రాజకీయాల స్థాయిని దిగజార్చేలా వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. టీవీకే అధికార ప్రతినిధి ఫెలిక్స్ జెరాల్డ్ కూడా స్పందించారు. అదే వ్యాఖ్యలను తన కుటుంబ సభ్యుల ముందు చెబుతారా? అని ప్రశ్నించారు. బీజేపీ కూడా ఈ వ్యాఖ్యలను ఖండించింది. ఉదయనిధిని వెంటనే అరెస్టు చేయాలని తమిళనాడు బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి నారాయణన్ తిరుపతి డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై కూడా విమర్శలు గుప్పించారు. నటి త్రిషకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ ఉపాధ్యక్షురాలు ఖుష్బూ సుందర్ డిమాండ్ చేశారు. అయితే ఈ వివాదాన్ని డీఎంకే కొట్టిపారేసింది. కావేరి జలాల సమస్య, డెల్టా రైతుల ఇబ్బందుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ అంశాన్ని పెద్దది చేస్తున్నారని మాజీ మంత్రి టీ. మనో తంగరాజ్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఉదయనిధి ప్రశ్నించకుండా అడ్డుకునేందుకే ఈ ప్రచారం జరుగుతోందని అన్నారు.

## ఉదయనిధికి హైకోర్టులో ఊరట.. బెయిల్ మంజూరు

తమిళనాడు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఈరోజే విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. అలాగే విచారణకు పూర్తిగా సహకరించాలని ఉదయనిధికి సూచించింది.

ఈ నేపథ్యంలో బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఉదయనిధిని రిమాండ్‌కు పంపే ఆలోచన తమకు లేదని తమిళనాడు పోలీసులు స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో మాత్రమే ఆయన్ను విచారిస్తున్నామని తెలిపారు. విచారణ పూర్తైన వెంటనే విడుదల చేస్తామని కూడా వెల్లడించారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**మొదటి పేజీ తరువాయి**

పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

తీరప్రాంతాల్లోని దాదాపు 33 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పవన్ వివరించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత వ్యవధిలోనే కీలక నిర్మాణాలను పూర్తి చేసి, ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తీరప్రాంత ప్రజల తాగునీటి భద్రతను నిర్ధారించడంలో జల్ జీవన్ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొనియాడారు.

# గుజరాత్‌లో చండీపుర వైరస్‌తో 22 మంది మృతి..

**గుజరాత్,మన జనప్రగతి ఆగస్ట్ 04:**

గుజరాత్‌లో చండీపుర వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. ఈ వైరస్ కారణంగా ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. సాధారణ జ్వరంలా మొదలయ్యే ఈ ఇన్‌ఫెక్షన్ కొన్ని గంటల్లోనే మెదడుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అసలు చండీపుర వైరస్ అంటే ఏంటి? ఇది ఎలా వ్యాపిస్తుంది? లక్షణాలు ఏంటి? చికిత్స ఉందా? తెలుసుకుందాం..



## ఏంటీ వైరస్?

రాబ్డోవిరిడే కుటుంబానికి చెందినదే ఈ చండీపుర వైరస్ (సీహెచ్‌పీవీ). దీన్ని తొలిసారి 1965లో భారత్‌లో గుర్తించారు. వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే శాండ్‌ఫ్లై (ఇసుక ఈగ) వల్ల ఇది వ్యాపిస్తుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవు.

## ఎవరికి ఎక్కువ ప్రమాదం?

ఈ వైరస్ ఎక్కువగా 15 ఏళ్లలోపు చిన్నారులపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, శాండ్‌ఫ్లైలు ఎక్కువగా ఉండే చోట్ల ప్రమాదం అధికంగా ఉంటుంది. వర్షాకాలంలో ఈగల సంఖ్య పెరగడంతో వైరస్ వ్యాప్తి కూడా ఎక్కువగా కనిపిస్తుంది.

## మొదట కనిపించే లక్షణాలు ఏవి?

ప్రారంభంలో ఈ వైరస్‌ను గుర్తించడం కాస్త కష్టం. ఎందుకంటే మొదట సాధారణ వైరల్ జ్వరంలాగే కనిపిస్తుంది. జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం, ఫ్లూ లక్షణాలు ఉంటాయి. ఈ దశలో చాలామంది సాధారణ జ్వరంగా భావించే అవకాశం ఉంటుంది.

## ఎందుకు ప్రమాదకరం?

కొంతమంది చిన్నారుల్లో వైరస్ చాలా వేగంగా మెదడుపై దాడి చేస్తుంది. దీంతో మెదడు వాపు (ఎన్‌సెఫలైటిస్) వస్తుంది. ఆ తర్వాత పరిస్థితి గంటల వ్యవధిలోనే విషమించవచ్చు.

## తీవ్రమైన లక్షణాలు ఇవీ..

మూర్ఛ, స్పృహ కోల్పోవడం, కోమాలోకి వెళ్లడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందుల వంటి తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని కేసుల్లో ఆసుపత్రిలో చేరిన 48 నుంచి 72 గంటల్లోనే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

## చికిత్స ఉందా?

ప్రస్తుతం చండీపుర వైరస్‌కు ప్రత్యేకంగా పనిచేసే మందు లేదు. టీకా కూడా అందుబాటులో లేదు. రోగికి కనిపించే లక్షణాలను బట్టి చికిత్స అందిస్తారు. శ్వాస, రక్తపోటు వంటి కీలక అవయవాల పనితీరును నిలకడగా ఉంచే ప్రయత్నం చేస్తారు. అందుకే లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లడం కీలకం.

## ఎలా జాగ్రత్త పడాలి?

చండీపుర వైరస్‌కు ప్రత్యేక టీకా లేకపోవడంతో నివారణే ఉత్తమ మార్గం. శాండ్‌ఫ్లై కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు పూర్తి చేతులు కవర్ అయ్యేలా దుస్తులు వేయాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కీటకనాశక ద్రావణాలు, దోమతెరలు ఉపయోగించాలి. జ్వరం, వాంతులు, మూర్ఛలు కనిపిస్తే వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

## ఎందుకు అప్రమత్తంగా ఉండాలి?

చండీపుర వైరస్ చాలా అరుదుగా కనిపించినా, ఒకసారి సోకితే వేగంగా తీవ్ర స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. అందుకే పిల్లల్లో సాధారణ జ్వరంతో పాటు నాడీ సంబంధిత లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# జనన మరణాల నమోదుకు కొత్త రూల్స్..

**మొదటి పేజీ తరువాయి**

లోక్‌సభలో ఇదివరకే ఆమోదం పొందిన ఈ బిల్లు, త్వరలోనే చట్టరూపం దాల్చనుంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. తాజా సవరణల ప్రకారం, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యంగా నమోదు చేయాలంటే కఠిన నిబంధనలు వర్తిస్తాయి. ఘటన (పుట్టిన లేదా మరణించిన) జరిగిన ఏడాది తర్వాత (రెండేళ్ల లోపు) నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. ఒకవేళ రెండేళ్లు దాటిన పక్షంలో, ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు ఉంటేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ సందర్భంగా మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, జనన మరణాలను నిర్ణీత సమయంలోగా నమోదు చేయడాన్ని ప్రోత్సహించడంతో పాటు, తప్పుడు సమాచారం, అవకతవకలను అరికట్టడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3.5 లక్షల రిజిస్ట్రేషన్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 2014లో 86.6 శాతంగా ఉన్న జననాల నమోదు 2024 నాటికి 99 శాతానికి పైగా చేరిందని ఆయన వివరించారు. అదేవిధంగా మరణాల నమోదు 72.5 శాతం నుంచి 99.4 శాతానికి పెరిగిందని మంత్రి వెల్లడించారు. బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బీజేపీ ఎంపీ దర్శన సింగ్ మాట్లాడుతూ, ఈ కొత్త సవరణలు వ్యవస్థను మరింత సరళంగా, పారదర్శకంగా మారుస్తాయని కొనియాడారు. అయితే, రెండేళ్ల తర్వాత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాలనే నిబంధనపై బీజేడీ ఎంపీ డాక్టర్ సంతృప్త్ మిశ్రా కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇప్పటికే పనిభారంతో ఉన్న న్యాయస్థానాలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వైసీపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, అన్నాడీఎంకే సహా పలు పార్టీల సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు.

# పెద్ద ఎత్తున కల్తీ మసాలాల తయారీ

**మొదటి పేజీ తరువాయి**

3 క్రిమినల్ కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, టాల్కమ్ పౌడర్లు, ఇండస్ట్రియల్ కలర్స్, రైస్ బ్రాన్ అయిల్ నకిలీ మసాలాల్లో వినియోగించినట్టు గుర్తించామన్నారు. కల్తీ మసాలాల వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కల్తీ ఆహార పదార్థాల కేసులపై త్వరలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు

హైదరాబాద్ కల్తీ మసాలా తయారీముఠా కేసులో హైదరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రకటించారు. ప్రమాదకర రసాయనాలతో టన్నుల మసాలా దినుసులను తెలుగు రాష్ట్రాలకు ఈ ముఠా సరఫరా చేస్తోందని తెలిపారు. సిట్ ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై హెచ్ -ఫాస్ట్ మెరుపు దాడులు చేసిందని సీపీ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాలు తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రియల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో క్యాన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఊ-ఈం÷ ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్

**మొదటి పేజీ తరువాయి**

సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-్గ÷బైర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-్గ÷బైర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

# అగమ్య గోచరంగా ప్రభుత్వాసుపత్రులు

**మొదటి పేజీ తరువాయి**

గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్‌రావు పోస్టుపెట్టారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ÷ఎఖ పరిధిలోని ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్సీ మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ÷ఎఖని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోవడం దురదృష్టకరమని హరీశ్‌రావు అన్నారు. దీంతో వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పుకొచ్చారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతుందని తెలిపారు. రో÷-లడెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. వెంటనే డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ఉలిందకొండ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

- రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి
- సైబర్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయండి




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్ట్ 04:-**ఉలిందకొండ పోలీసు స్టేషన్ ను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు,వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు.రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు.డ్రంకెన్ డ్రైవ్, ఒపెన్ డ్రింకింగ్ లపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు.ప్రాపర్టీ కేసులను చేధించి రికవరీలు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సైబర్ నేరాలపై,మహిళల పై జరిగే నేరాల గురించి,మహిళల రక్షణ చట్టాల పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.జిల్లా ఎస్పీతో పాటు కర్నూలు రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు,ఉలిందకొండ ఎస్సై నిరంజన్ రెడ్డి ఉన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆర్జిత సేవలు,ప్రత్యేక దర్శనాలు రద్దు



**తిరుమల మన జనప్రగతి ఆగస్టు 04:-**తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో తొమ్మిది రోజుల పాటు పలు ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రద్దు చేసింది.బ్రహ్మోత్సవాల సందర్భంగా అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ సేవ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలను ఈ తొమ్మిది రోజుల పాటు నిర్వహించబోమని టీటీడీ వెల్లడించింది.అదేవిధంగా వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు కల్పించే ప్రత్యేక దర్శనాలతో పాటు ప్రవాస భారతీయులు, దాతలకు సంబంధించిన దర్శనాలను కూడా తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపింది.బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, భక్తులు ఈ మార్పులను గమనించి టీటీడీ అధికారులకు సహకరించాలని దేవస్థానం విజ్ఞప్తి చేసింది.

# పంప్ హౌస్‌లను పరిశీలించి తుంగభద్ర హెచ్‌ఎల్సి ఛైర్మన్ జోగిరెడ్డి



**లింగాల మన జనప్రగతి ఆగస్టు 04:-** మండల పరిధిలోని వెలిదండ్ల,ఇప్పట్ల పంప్ హౌస్‌లను తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి లింగాల మండల అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్,కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా మారెడ్డి జోగిరెడ్డి గారు మాట్లాడుతూ రైతులకు సాగునీరు సకాలంలో,ఎలాంటి అంతరాయం లేకుండా అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.పంప్ హౌస్‌ల పనితీరు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ,అవసరమైన మరమ్మతులు,నిర్వహణ పనులు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. సాగునీటి విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఎకరాకు నీరు చేరేలా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.రైతుల ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని, సాగునీటి వ్యవస్థను మరింత బలోపేతం చేసి వ్యవసాయాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని మారెడ్డి జోగిరెడ్డి గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుడికాల అధికారులతో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయవాడలో మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ముగింపు వేడుకలు




**విజయవాడ, మన జనప్రగతి, ఆగస్టు 04:-** మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ముగింపు వేడుకలు విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సహా పలువురు ప్రముఖులు పాల్గొని కృష్ణారావు చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, తెలుగు భాష, సంస్కృతి, విద్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధికి మండలి వెంకట కృష్ణారావు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలుగు భాష, సాంస్కృతిక పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేసిన కృషిని కూడా ప్రశంసించారు.ఈ సందర్భంగా 'అజాతశత్రువు ఆదర్శ నేత మండలి వెంకటకృష్ణారావు', 'కృష్ణా మండలి' గ్రంథాలను ఆవిష్కరించడంతో పాటు వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు 'మండలి వెంకటకృష్ణారావు భాషా సాంస్కృతిక సేవ పురస్కారాలు' అందజేశారు.

# అన్ని పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 04:-** మహిళలు,బాలల సంక్షేమానికి సంబంధించిన అన్ని పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్ జిల్లా బాలల సంక్షేమ సమితి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిషు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం స్వతంత్రంగా పనిచేయాల్సి ఉందని, ఆ మేరకు వెంటనే ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసుకొని చైల్డ్ వెల్ఫేర్ కమిటీతో కో ఆర్డినేట్ చేసుకొని పని చేయాలని కలెక్టర్ డిసిపిఓ ను ఆదేశించారు.పీఎం సీఏఆర్ఈఎస్ పథకం కింద కేవలం 16 మంది మాత్రమే లబ్ధిదారులుగా గుర్తించారని, విధులలో ఎటువంటి నిర్లక్ష్య ధోరణి సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలో బాలల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలయ్యేలా అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.. జిల్లాలో అమలవుతున్న బాలల సంక్షేమ కార్యక్రమాలపై సంబంధిత అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని, ఫీల్డ్ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు కేవలం నామమాత్రంగా కాకుండా ఫలితాల ఆధారంగా అమలుకావాలని ఆదేశించారు.జిల్లా ప్రధాన కేంద్రంతో పాటు అన్ని డివిజన్‌లలో కూడా వీధి బాలలను గుర్తించి రక్షించే ప్రత్యేక డ్రైవ్‌లను ప్రతి నెల నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీధి బాలలను గుర్తించిన వెంటనే వారికి అవసరమైన సంరక్షణ, పునరావాసం కల్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఐసిడిఎస్ పిడి విజయ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ జుబేదాబేగం, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ లు సంజీవ రెడ్డి, వెంకట రమణయ్య, మధు సుధాకర్, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ అధికారి దివాకర్, అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ హుస్సేన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగం అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి

## పాఠశాల డ్రాప్‌అవుట్‌లను 5 శాతం లోపే పరిమితం చేయడమే లక్ష్యం: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 04:-**జిల్లాలో విద్యా రంగం అభివృద్ధి, విద్యా నాణ్యత మెరుగుదలకు అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం విద్యా రంగంలోని కీలక సూచికల పురోగతిపై నిర్వహించిన ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ సమీక్షించారు. పాఠశాల ప్రవేశాలు, బడి బయట ఉన్న పిల్లల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.పనితీరు తక్కువగా ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో బాలికల చదువు మానివేతలు తగ్గించేందుకు అదనంగా 12 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ఇతర హాస్టళు ,, మోడల్ పాఠశాలల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.వలస వెళ్లే కుటుంబాల పిల్లలు చదువుకు దూరం కాకుండా సీజనల్ హాస్టళ్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో పాఠశాల డ్రాప్‌అవుట్‌లను 5 శాతం లోపే పరిమితం చేయడమే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు.ప్రధానోపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరచాలని, మండల విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు వంద శాతం నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల మౌలిక వసతుల వివరాలను లీప్ యాప్‌లో నమోదు చేయాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రత విషయంలో రాజీ పడకూడదని తెలిపారు. పాఠశాలల విద్యా కార్యక్రమాల వివరాలను తల్లిదండ్రులకు చేరవేసేందుకు సామాజిక మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. పనిచేయని తాగునీటి శుద్ధి యంత్రాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు.ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శామ్యూల్, జిల్లా విద్యాధికారి జి. సుధాకర్, సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ లోకరాజు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదు

## రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన






**కడప,మన జనప్రగతి ఆగస్టు 04:-** దళితులకు ఎక్కడా అన్యాయం జరగకుండా చూడడమే కాకుండా జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే.. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ లక్ష్యం అని రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన తోపాటు డిఆర్వో మల్లికార్జునుడు, గౌరవ అతిథిగా బద్వేలు ఎమ్మెల్యే డా. సుధా హాజరయ్యారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. సమావేశంలో అజెండాలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని విడివిడిగా పరిశీలిస్తూ అధికారుల నుంచి పూర్తి వివరాలు సేకరించి, అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఎస్సీ, ఎస్టీ కింద నమోదయ్యే ప్రతి కేసులో బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సహాయ, పునరావాస, ఉపాధి అవకాశాలు నిబంధనల ప్రకారం ఎలాంటి జాప్యం లేకుండా అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. చట్టం అమలులో అలసత్వానికి తావులేకుండా ప్రతి కేసును బాధ్యతాయుతంగా పర్యవేక్షించాలని ఆమె స్పష్టం చేశారు.జిల్లాలో ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) చట్టం కింద నమోదైన పెండింగ్, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిని సబ్ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పులివెందుల, కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, రాజంపేట పోలీసు ఉపవిభాగాలు, మహిళా పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల వివరాలను సమీక్షిస్తూ, దర్యాప్తు ఆలస్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫోరెన్సిక్ నివేదికలు, న్యాయస్థానాల్లో ఉన్న స్టేలు, ఇతర పరిపాలనా కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బాధితులకు ఆర్థిక సహాయం విషయంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేసిన సబ్ కలెక్టర్, 2026 జనవరి 1 నుంచి జూలై 20 వరకు ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) చట్టం కింద మంజూరైన ఆర్థిక సహాయం సంబంధిత అంశాలపై సమీక్షించారు. ఈ పీరియడ్ న్ 34 కేసులకు చెందిన 46 మంది బాధితులకు రూ.74,31,250 ఆర్థిక సహాయం అందించిన వివరాలను పరిశీలిస్తూ, అర్హులైన ప్రతి బాధితుడికి నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.బద్వేలు ఎమ్మెల్యే డా. సుధా.. తమ నియోజకవర్గ పరిధిలోని ఎస్సి ఎస్టి అట్రాసిటీ కేసుల ఆలస్యంపై సమీక్షించారు. డెడ్ సందర్భంగా బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, పింఛన్లు, పునరావాస చర్యలు కూడా నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో అమలయ్యేలా సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని కమిటీ సభ్యులను కోరారు. బాధిత కుటుంబాల జీవనోపాధి మెరుగుపడేలా అవసరమైన ప్రతి చర్యను వేగవంతం చేయాలన్నారు.ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ పురోగతి, కేసుల పరిష్కారం, శిక్షల శాతం తదితర అంశాలను కూడా కమిటీ సమగ్రంగా సమీక్షించింది. ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది సమర్పించిన నివేదిక ఆధారంగా కేసుల స్థితిగతులను పరిశీలించిన సబ్ కలెక్టర్, నాణ్యమైన దర్యాప్తు, సమగ్ర ఆధారాల సేకరణ ద్వారా నిందితులకు చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా పోలీసు, అభియోగ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సంబంధిత శాఖలు నిర్దేశిత గడువులో అమలు చేయాలని, ప్రతి కేసుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన స్పష్టం చేశారు.కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చింతామణి, ఎస్డీసి నీలమయ్య, ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్, కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు డివిజన్ల ఆర్.డి.ఓ లు మురళి, శిరీష, చిన్నయ్య, చంద్రమోహన్, డివిజనల్ పోలీసు అధికారులు (ఎస్డీపీఓలు), ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది శైలజ, తదితర కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కన్నతల్లిని హత్య చేసిన కుమారుడు..?

## సిద్ధవటం మండలంలో దారుణం

### కూతురిపై అనుమానంతో తల్లిని హత్య చేసినట్లు కుటుంబ సభ్యుల ఆరోపణలు

### - సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి కోసం పోలీసుల గాలింపు



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 04:-**మండలంలోని మూలపల్లిమాచుపల్లి రహదారిలోని మాచుపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న వరి పొలంలో ఓబులమ్మ (50) అనే మహిళ మృతదేహం లభ్యమైన ఘటన సంచలనం రేపింది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా, మృతురాలి వద్ద లభ్యమైన పర్సులోని వివరాల ఆధారంగా ఆమె వనిపెంట గ్రామానికి చెందిన ఓబులమ్మగా గుర్తించారు. మృతురాలి కుమారుడు రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం, తన సోదరుడు బాబు సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై తల్లిని వనిపెంట నుంచి తీసుకెళ్లాడని, తన కుమార్తె హారికపై అనుమానంతో ఈ దారుణానికి పాల్పడి ఉండొచ్చని ఆరోపించారు. అలాగే తన భార్యపై కూడా గతంలో హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పలు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనపై డీఎస్పీ బాలస్వామిరెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు హారిక, శ్రీనివాసులు విచారణ కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలను పోలీసులు ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. దర్యాప్తు కొనసాగుతోంది.

# ఫైరింగ్ వార్షిక ప్రాక్టీస్‌లో భాగంగా పునశ్చరణ తరగతులు



**కడప మన జనప్రగతి ఆగస్టు 04:-** జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ లో భాగంగా వ్యక్తిగత భద్రతా అధికారులకు ఫైరింగ్ లో మెళకువలు, జాగ్రత్తలను నిపుణులైన పోలీసు అధికారులు వివరించారు. మంగళవారం నగర శివార్లలోని జె.ఎం.జె కళాశాల వద్దనున్న ఫైరింగ్ రేంజి లో ఏ.ఆర్ డి.ఎస్.పి పి. నాగేశ్వర రావు ఆధ్వర్యంలో పి.ఎస్.ఓ(వ్యక్తిగత భద్రతా అధికారులు)లకు పునశ్చరణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్.ఐ పెద్దయ్య, ఆర్.ఎస్.ఐ వెంకటేశ్వర్లు, వ్యక్తిగత భద్రతా అధికారులు(పి.ఎస్.ఓ) లు పాల్గొన్నారు.

# మహిళలు, బాలికల భద్రతపై పోలీసుల అవగాహన కార్యక్రమం

**రాజంపేట, మన జనప్రగతి ఆగస్టు 04:-** మహిళలు, బాలికల భద్రతకు వైఎస్సార్ కడప జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాజంపేట పట్టణ సీఐ నాగార్జున తెలిపారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఆదేశాల మేరకు మంగళవారం రాజంపేట పట్టణంలోని పుల్లంపేట రహదారిపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న'శక్తి' యాప్, డయల్-112, 1091 (మహిళల హెల్ప్‌లైన్), 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 181 (మహిళల సహాయ కేంద్రం), 1930 (సైబర్ మోసాల హెల్ప్‌లైన్) సేవల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే సైబర్ నేరాల నివారణ, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అపరిచితుల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ సేవలను వెంటనే వినియోగించుకోవాలని, ప్రతి మహిళ తన భద్రతకు సంబంధించిన చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సీఐ నాగార్జున సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# సుస్థిరమైన జీవితానికి తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం

## ● ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నల్లపురెడ్డిపల్లిలో అవగాహన కార్యక్రమం




**పులివెందుల,మన జనప్రగతి ఆగస్టు 04:-** సుస్థిరమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల సంస్కృతిని ప్రతి కుటుంబం ప్రోత్సహించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి, ఇన్‌చార్జి సీడీపీఓ ఆర్. మాబున్ని పిలుపునిచ్చారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 8 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లి-1 అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్. మాబున్ని తల్లిపాల ప్రాధాన్యతపై బాలింతలు, గర్భిణులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిశువు జన్మించిన వెంటనే తల్లి నుంచి వచ్చే తొలి ముర్రుపాలు అత్యంత విలువైనవని, వాటిలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. అందువల్ల బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. శిశువుకు తొలి ఆరు నెలల వరకు తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని, ఈ సమయంలో నీరు, చక్కెర నీరు, పండ్ల రసాలు, ఆవు లేదా గేదె పాలు, గంజి వంటి ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని చెప్పారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన అన్ని పోషకాలను అందించడంతో పాటు వ్యాధుల నుంచి రక్షణ కల్పించి, సులభంగా జీర్ణమవుతాయని వివరించారు. ఆరు నెలలు పూర్తయిన తర్వాత తల్లిపాలతో పాటు ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని మెత్తగా జావ రూపంలో రోజుకు రెండు నుంచి మూడు సార్లు ఇవ్వాలని, బిడ్డ ఎదుగుదలకు అనుగుణంగా ఆహారం పరిమాణాన్ని పెంచుతూ రోజుకు మూడు నుంచి నాలుగు సార్లు అందించాలని సూచించారు. అలాగే తల్లిపాలను రెండు సంవత్సరాల వయస్సు వరకు కొనసాగించడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని తెలిపారు. ఉద్యోగినులైన తల్లులు తమ పాలను శుభ్రమైన పాత్రలో పిండి ఫ్రిజ్‌లో భద్రపరిచి, 24 గంటలలోపు ఇంటి సభ్యులు కప్పు, చెంచా ద్వారా శిశువుకు తాగించవచ్చని తెలిపారు. ఈ విషయంపై కుటుంబ సభ్యులందరికీ అవగాహన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ వై.వి. రమణమ్మ, అంగన్వాడీ టీచర్లు లక్ష్మీదేవి, విజయభారతి, హరిత, గర్భిణులు, బాలింతలు, శిశువుల తల్లులు పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

## - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి రైతు సంఘం వినతి



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 04:-** అన్నమయ్య జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి,రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రామాపురం మండలంలో రవాణా,యువజనమరియు క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో రైతులతో కలిసి రంగారెడ్డి మంత్రి రాంప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో అన్నమయ్యజిల్లాలోని అన్నినియోజకవర్గాలను కరువు (మదనపల్లె తంబళ్లపల్లె పీలేరు రాయచోటి పుంగనూరు)అన్నిప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు. వర్షాభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులు కరువును ఎదుర్కొనే విధంగా వారికి రెండు లక్షల రూపాయలు రుణ రుణమాఫీ చేసి,తిరిగి వెంటనే కొత్త రుణాలను మంజూరు చేయాలని ఆయన మంత్రిని కోరారు. రాయచోటి ప్రాంతంలోని గాలివీడు మండలంలో ఉన్న వెలిగల్లు ప్రాజెక్టుకు హంద్రీ-నీవా ద్వారా వెంటనే నీటిని విడుదల చేయాలని,చిన్నమండెం మండలంలోని నాగిరెడ్డి రిజర్వాయర్‌కు కూడా నీరు వదలాలని కోరారు. ఈ ప్రాజెక్టుల పరిధిలోని ప్రధాన కాలువలు, ఉపకాలువల పనులను పూర్తి చేసి సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు అప్పులుచేసి వేరుశెనగ, వరి తదితర పంటల విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నప్పటికి నీటి కొరతతో సాగుచేయలేని పరిస్థితి నెలకొందని రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డిని రైతు సంఘం తమ వినతి పత్రంలో కోరింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాయచోటి ఏరియా అధ్యక్షులు హరినాథ నాయుడు, నాయకులు షబ్బీర్ భాష,నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాచమల్లు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

## - డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ,మంత్రి లోకేష్ రాజీనామాకు డిమాండ్..!




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 04:-**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రొద్దుటూరులో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ భృతిని అర్హులైన యువతకు తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 6వ తేదీ నుంచి చేపట్టనున్న పార్టీ భవిష్యత్ కార్యాచరణపై వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించాలని, శక్తివంచన లేకుండా పార్టీ విజయమే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు పూర్తి సహకారం అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, మహిళా నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేరుశనగ పంటలపై వ్యవసాయ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

## ● ఎల్నినో పరిస్థితులకు అనుగుణంగా స్వల్పకాలిక పంటల సాగుకు సూచన

## ● శాస్త్రవేత్తల సిఫారసు మేరకే ఎరువుల వినియోగం చేయాలి




**వేముల మన జనప్రగతి ఆగస్టు 04:-**వేముల మండల పరిధిలోని స్థానిక వేల్పుల గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో వేరుశనగ పంటలను పరిశీలించారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి జి.పి ఓబులేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంటల ప్రస్తుత పరిస్థితి, సాగు విధానాలు, చీడపీడల ప్రభావాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, వేరుశనగ పంటలో సస్యరక్షణ, నీటి యాజమాన్య పద్ధతులను రైతులు సమర్థవంతంగా పాటించాలని సూచించారు. చీడపీడల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వ్యవసాయ అధికారుల సలహాలను అనుసరించాలని తెలిపారు. ప్రస్తుత ఎల్నినో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు స్వల్పకాలిక పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎరువులను శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన మోతాదు మేరకే వినియోగించాలని, అధికంగా ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతినే అవకాశం ఉందని వివరించారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చీడపీడల లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులను మార్చుకుంటే పంట నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.పి ఓబులేష్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది లక్ష్మీప్రసన్న,కిషోర్ నాయక్ మరియు రైతులు పాల్గొన్నారు.

# టిడిపి ప్రభుత్వంలోని ఆలయాలకు సీసీ రోడ్లకు మహర్దశ..

## - రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి



**రామాపురం మన జనప్రగతి ఆగస్టు 04:-**టిడిపి ప్రభుత్వం లోనే దేవాలయాలకు మరియు సిమెంట్ రోడ్లకు మహార్దశ కల్పించడం జరిగిందని రవాణా యోజన క్రీడ శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం రామాపురం మండలంలోని బండ పల్లె టోల్ ప్లాజా సమీపంలోని హసనాపురం,చిట్లూరు,బండపల్లి,కుమ్మర పల్లె నాలుగు గ్రామాల సరిహద్దుల్లో గల సోమారాయనపేటలో వెలసిన శ్రీ అభయ హస్త ఆంజనేయ స్వామి దేవస్థానానికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి చొరవతో ధూప,దీప నైవేద్యానికి మరియు దేవాలయానికి రహదారి సిసి రోడ్ల నిర్మాణం పనులకు గాను అడిగిన తక్షణమే సీసీ రోడ్లను మంజూరు చేసి భక్తి భావం చాటుకున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డికి భక్తజన సమూహం ఎన్నటికీ రుణపడి ఉంటుందని మంగళవారం సీసీ రోడ్డు ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రికి అభయ హస్త ఆంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ మరియు ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సి వి సుబ్బారెడ్డి ఆలయ కమిటీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం వైస్ ప్రెసిడెంట్ కెవిఎస్ నాయుడు కోశాధికారి పుల్లగూర వెంకటరమణ సెక్రటరీ ఊరగాయల రామ్ బసిరెడ్డి మరియు మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి మద్ది రేవుల రమేష్ రెడ్డి భాస్కర్ రెడ్డి వెంకటసుబ్బయ్య ఓబులేసు బాబు నాగ సుబ్బారెడ్డి పార్టీ అభిమానులు శ్రేయోభిలాషులు ప్రజలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# నవజాత శిశువుకు రక్షణ కవచం తల్లిపాలే: ఐసిడిఎస్ సూపర్వైజర్ డా.స్వర్ణలత



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 04:-**నవజాత శిశువుకు తల్లిపాలే తొలి రక్షణ కవచం అని వేంపల్లె ఐసిడిఎస్ సూపర్వైజర్ డా.స్వర్ణలత అన్నారు. మంగళవారం చింతలమడుగు పల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి నుంచి వచ్చే మొదటి ముర్రుపాలు ఎంతో వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటాయని, బిడ్డ పుట్టిన గంటలోపే త్రాగించడం ఎంతో అవసరమన్నారు. అలాగే 6 నెలల వరకు కేవలం తల్లిపాలను మాత్రమే బిడ్డకు ఇవ్వాలని, తరువాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం అందించాలని కోరారు. శిశువు ఆరోగ్యం, ఎదుగుదల, దీర్ఘకాలిక మేల్కొలుపు అన్నింటికీ బలమైన పునాది తల్లిపాలతోనే ప్రారంభం అవుతుందన్నారు. తల్లిపాలకు సంబంధించి తప్పుడు భావాలను తొలగించడమే వారోత్సవాల ప్రధాన లక్ష్యమన్నారు. అంతేకాకుండా మండలంలోని కుప్పాలపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుభద్ర ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ అమీర్ జాను, సుధా, అంగన్వాడీ కార్యకర్తలు రాజకుమారి, దిల్షాద్, వరలక్ష్మి, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరులో ముగ్గురు కానిస్టేబుళ్లపై ఎస్పీ వేటు..!

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 04:-**కడప జిల్లా ప్రొద్దుటూరులో విధి నిర్వహణలో తీవ్ర అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ముగ్గురు పోలీసు సిబ్బందిపై జిల్లా ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్ చర్యలు తీసుకున్నారు. ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ దస్తగిరి, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, సాయిని వీఆర్ (వేకెన్సీ రిజర్వ్)కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి నుంచి ప్రొద్దుటూరుకు వచ్చిన కొందరు యువతులు వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారాన్ని అందుకున్న ఈ ముగ్గురు పోలీసు సిబ్బంది, వారిని బెదిరించి రూ.50 వేల నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై ఫిర్యాదు అందడంతో జిల్లా పోలీసు యంత్రాంగం వెంటనే స్పందించింది. ఏఎస్పీ విభు కృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టగా, ప్రాథమికంగా ఆరోపణలు నిజమేనని తేలిన నేపథ్యంలో ముగ్గురు కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోంది.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
05- 08 - 2026

# కూటమి పాలనతో అభివృద్ధిసంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 04:**-కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మంగళవారం ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని వివేకానంద కాలనీలో పర్యటించారు.కూటమి పాలన రెండేళ్ల నమ్మకంఅభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక భద్రతా పింఛన్లను రూ.4 వేల నుంచి వివిధ కేటగిరీల వారికీ రూ.6 వేల, రూ.10 వేల, రూ.15 వేల వరకు పెంచడం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# కమలాపురంలో అలుగు జంతువు ప్రత్యక్షం



**కమలాపురం మన జనప్రగతి ఆగస్టు 04:**-కమలాపురం నగర పంచాయతీలోని కుమ్మరి వీధిలో అరుదైన పంగోలియా జంతువు సోమవారం రాత్రి స్థానికులకు కనిపించడం జరిగింది.స్థానికులు జంతువును చూసిన వెంటనే ఇది విచిత్రంగా ఉంది అని దీనిని ఫారెస్ట్ వారికి అప్పగించాలని వారికి ఫోన్ చేయడం జరిగింది.ఫారెస్ట్ అధికారుల కు స్థానికులు దానిని అప్పగించడం జరిగింది.(దీని గురించి యూట్యూబ్ లో)పాంగోలిన్ అనగా శరీరమంతా గట్టి పొలుసులు కలిగిన ఒక అరుదైన క్షీరదం.దీన్ని తెలుగులో 'అలుగు' అని పిలుస్తారు.ఇది చీమలను,చెదపురుగులను తింటుంది మరియు ప్రపంచంలో అత్యధికంగా అక్రమ రవాణా చేయబడుతున్న జంతువులలో ఇది ఒకటి.పాంగోలిన్ ముఖ్య లక్షణాలుశరీరంపై గోళ్ళ,వెంట్రుకల లాంటి గట్టి కెరాటిన్ పొలుసులు ఉంటాయి.వీటికి పళ్లు ఉండవు,కానీ పొడవైన నాలుకతో చీమలను తింటాయి.ప్రమాదం ఎదురైనప్పుడు బంతిలా ముడుచుకుంటాయి.జాతులు మరియు రక్షణప్రపంచవ్యాప్తంగా మొత్తం 8 రకాల పాంగోలిన్లు ఉన్నాయి (ఆసియాలో 4,ఆఫ్రికాలో 4).చట్టవిరుద్ధంగా వీటిని చంపడం మరియు వేటాడటం నేరం.ఇలాంటి జంతువులు కనిపించడం అరుదు..

# ఉరవకొండలో ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



**ఉరవకొండ మన జనప్రగతి ఆగస్టు 04:**-ఉరవకొండ పట్టణంలోని సెంటర్-15 పరిధిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వినీత, అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి హాజరై గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెంటర్-5, 6, 10, 15లకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సంయుక్తంగా పాల్గొని తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.డాక్టర్ వినీత మాట్లాడుతూ...శిశువు జన్మించిన వెంటనే ఇచ్చే మొదటి ముర్రుపాలు బిడ్డకు తొలి టీకాలా పనిచేస్తాయని తెలిపారు. ముర్రుపాలు శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని పేర్కొన్నారు.శిశువు పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వయస్సు వరకు నీరు కూడా ఇవ్వకుండా కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లిపాలలో శిశువు శారీరక,మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. తల్లిపాలు తాగడం వల్ల విరేచనాలు,నిమోనియా,శ్వాసకోశ వ్యాధులు, ఇతర ఇన్ఫెక్షన్ల ప్రమాదం తగ్గుతుందని వివరించారు.తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డతో పాటు తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని డాక్టర్ వినీత తెలిపారు. గర్భాశయం త్వరగా యథాస్థితికి చేరడంతో పాటు రొమ్ము, అండాశయ క్యాన్సర్‌ల ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.అనంతరం అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి మాట్లాడుతూ..పసిపిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ కేంద్రాలు కీలక సేవలు అందిస్తున్నాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సరోజ, ఆయా సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**- అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జయలక్ష్మి**



**వజ్రకరూరు మన జనప్రగతి ఆగస్టు 04:**-తల్లిపాల ప్రాముఖ్యతతో పాటు వివిధ వ్యాధుల నివారణపై వైద్య సిబ్బంది ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జయలక్ష్మి అన్నారు.స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. యుక్తవయస్సులో రక్తహీనత నివారణకు వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరించారు. కుష్టు, క్షయ, హెచ్ఐవీఎయిడ్స్ వ్యాధుల నివారణపై కూడా సూచనలు చేశారు. అనంతరం కొనకొండ్ల గురుకుల పాఠశాల విద్యార్థులకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించి, కుష్టు వ్యాధిపై మంచి పరిజ్ఞానం ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.కార్యక్రమంలో పారామెడికల్ అధికారి నాగన్న, ఆరోగ్య విద్యా అధికారి గంగాధర్, సామాజిక ఆరోగ్య అధికారులు గురుప్రసాద్, లక్ష్మీదేవి, బహుళారోగ్య విస్తరణ అధికారి కుమారస్వామి, సుశీలమ్మ, ఇతర వైద్య సిబ్బంది, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టోన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ



**గాలివీడు మన జనప్రగతి ఆగస్టు 04:**-గాలివీడు మండలం కూర్మయ్య గారి పల్లి ఎంపీపీ స్కూల్ నందు మంగళవారం రాయచోటి వాస్తవ్యులు కొత్త షణ్ముఖ త్రివేది పుట్టినరోజు సందర్భంగా వారి నాన్న కొత్త సూర్య తేజ తల్లి శ్రావణి తాత లయన్ కొత్త సుదర్శన్ ఆధ్వర్యంలో పిల్లలకు నోటు పుస్తకాలు మరియు స్టడీ మెటీరియల్ మరియు పేస్టు బ్రష్ ఇవ్వడం జరిగిందని వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పీఎస్ హరినాథ రెడ్డి తెలియజేశారు.అనంతరం డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి పిల్లలకు దంత గురించి అవగాహన సదస్సు మరియు పిల్లలకు దంతాలను పరీక్షించడం జరిగినది పిల్లలు చాక్లెట్స్ తక్కువగా తినాలని ప్రతిరోజు ఉదయం సాయంత్రం రెండు పూటలా బ్రష్ చేసుకోవాలని పిల్లలకు దంతాలు ఏ సమస్య వచ్చినా మా దగ్గరకు వచ్చి సలహాలు చ తీసుకోవాల్సిన కోరారు అనంతరం లయన్ కొత్త సుదర్శన్ మాట్లాడుతూ...మనసులు శాఖాహారం తీసుకోవడం చాలా మంచిదని మాంసాహారం ఆరోగ్యానికి అంత మంచిది కాదని అలాగేమనిషి బతికున్నప్పుడు సేవా కార్యక్రమాలు చేయొచ్చని అలాగే చనిపోయే తర్వాత కూడా ప్రజలకు ఉపయోగపడవచ్చునని చనిపోయినప్పుడు నేత్రదానము మరియు అవయవ దానాలు చేయవచ్చునని మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా చనిపోయినప్పుడు మమ్మల్ని సంప్రదించిన మేము ఆ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలియజేశారు అనంతరం ఎంఈఓ పి నాగరాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూనే మన స్కూలుకు రావడం చాలా సంతోషమన్నారు అనంతరం వ్యవస్థాపక అధ్యక్షులు హరినాథ్ రెడ్డి పిల్లలందరికీ పాదరక్షలు ఉచితంగా అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానికులు టి శ్రీనివాసులు సామాజిక కార్యకర్త స్కూల్ హెడ్మాస్టర్ ఎం గీతా ఆశా వర్కర్లు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# మరో వారం రోజుల్లో హంద్రీనీవాకు నీటి విడుదల

**రైతుల కల నెరవేరనున్న వేళ..సాగు పనులకు సిద్ధమైన పొలాలు**



**ఉరవకొండ మన జనప్రగతి ఆగస్టు 04:**- మరో వారం రోజుల్లో హంద్రీనీవా ఎత్తిపోతల పథకం కాలువకు ప్రభుత్వం నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సాగు, తాగునీటి అవసరాలకు ఊరట కలిగించనున్న ఈ నీటి విడుదల కోసం రైతులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా త్వరలో నీరు అందనున్నట్లు సమాచారం రావడంతో రైతులు సాగు పనులను వేగవంతం చేశారు. ఇప్పటికే పొలాలను దుక్కి చేసి, పంటల సాగుకు అనువుగా సిద్ధం చేసుకున్నారు. కాలువలో నీటి ప్రవాహం ప్రారంభం కాగానే విత్తనాలు విత్తేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేస్తున్నారు.హంద్రీనీవా జలాలు ఆయకట్టు ప్రాంతాలకు చేరితే వేలాది ఎకరాల్లో సాగు విస్తరించడంతో పాటు రైతు కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించనున్నాయి.

ఈ సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు.ప్రభుత్వం చేపట్టనున్న నీటి విడుదలతో వ్యవసాయ రంగానికి ఊతం లభించడంతో పాటు సాగునీటి సమస్యలకు కొంత మేర పరిష్కారం లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో వారం రోజుల్లో హంద్రీనీవా కాలువలో నీరు ప్రవహించనున్న నేపథ్యంలో ఆయకట్టు ప్రాంతాల్లో సాగు సందడి నెలకొనే అవకాశముంది.

# చెన్నూరు పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.యుగంధర్



**చెన్నూరు మన జన ప్రగతి ఆగస్టు 04:**-చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పి. యుగంధర్ మంగళవారంపీహెచ్‌సీ సందర్శించి, ప్రయోగశాల (ల్యాబ్), ఫార్మసీని పరిశీలించి, ఈ హెచ్ ఆర్ సేవల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ హెచ్ ఆర్ను సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు అందజేశారు.అనంతరం సభా భవనంలో నిర్వహించిన ఆశా దినోత్సవ కార్యక్రమంలో జరిగిన సమావేశంలో డాక్టర్ యుగంధర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా అజెండా గురించి వివరించారు. అలాగే (హోమ్-బేస్డ్ న్యూబోర్న్ కేర్) మరియు (హోమ్-బేస్డ్ యంగ్ చైల్డ్ కేర్) కిట్ల ప్రాముఖ్యతను వివరించి,తల్లి-శిశు ఆరోగ్య సేవలను గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ఈ కిట్లను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా వినియోగించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు, మెడికల్ ఆఫీసర్లు, ఎమ్మెల్ హెచ్పి లు, ఏఎన్ఎం లో లు మరియు పీహెచ్‌సీ చెన్నూరు పరిధిలోని ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్‌కేఆర్ నగర్ హరిజన వాడకు 21 విద్యుత్ స్తంభాల మంజూరు

- **30 ఏళ్ల విద్యుత్ సమస్యకు పరిష్కారం దిశగా అడుగు**
- **చమర్తి జగన్మోహన్ రాజుకు గంజి సుబ్బరాయుడు కృతజ్ఞతలు**



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 04:**-మండలంలోని ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో గత మూడు దశాబ్దాలుగా నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కారానికి కీలక ముందడుగు పడింది. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్ రాజు కృషితో 21 విద్యుత్ స్తంభాలు మంజూరైనట్లు టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర వాణిజ్య అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం ఎస్‌కేఆర్ నగర్‌లో ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు టూ-ఫేజ్ విద్యుత్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎస్సీ కాలనీకి త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఈ విద్యుత్ స్తంభాలు ఉపయోగపడనున్నాయని చెప్పారు. అలాగే పార్వతీపురం సమీపంలోని తాగునీటి బోరుకు త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ లేక తాగునీటి సమస్య ఏర్పడిందని, కొత్తగా మంజూరైన విద్యుత్ స్తంభాలతో ఆ సమస్యకు కూడా త్వరలో పరిష్కారం లభించనుందని పేర్కొన్నారు. ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీలో కొత్త తాగునీటి బోరు ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్, తాగునీటి సమస్యల పరిష్కారానికి సహకరించిన రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్ రాజుకు ఈ సందర్భంగా గంజి సుబ్బరాయుడు కృతజ్ఞతలు తెలిపారు.




# భాకరాపేట సెక్టార్‌లో తల్లిపాల వారోత్సవాలు..

**- తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన**

**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 04:**-మండలంలోని భాకరాపేట సెక్టార్ పరిధిలోని మాధవరం 123వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ శ్రీవిద్య మాట్లాడుతూ తల్లిపాలు తల్లి, బిడ్డ ఆరోగ్యానికి అమూల్యమైన వరమని పేర్కొన్నారు. పుట్టిన గంటలోపే ముర్రుపాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు తొలి టీకాతో సమానమైన రోగనిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, రోజుకు 8 నుంచి 12 సార్లు బిడ్డ అవసరాన్ని బట్టి పాలివ్వాలని సూచించారు. తల్లిపాల వల్ల శిశువులో రోగనిరోధక శక్తి, మెదడు ఎదుగుదల మెరుగుపడటంతో పాటు అనారోగ్యాలు తగ్గుతాయని, తల్లులకు త్వరగా కోలుకోవడం, బరువు తగ్గడం, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని వివరించారు. పాలిచ్చే తల్లులు తగినంత నీరు తాగడంతో పాటు పప్పులు, ఆకుకూరలు, పాలు, పండ్లు, ధాన్యాలు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పద్మావతి, సచివాలయ కార్యదర్శి సుజాత, గర్భిణులు, బాలింతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వివోఏలకు వేతనాలు పెంచాలి..!

**- సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర**



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 04:**-వివోఏ లకు వేతనాలు పెంచాలని మంగళవారం పత్తికొండ పట్టణంలోని వెలుగు కార్యాలయం నందు ఏ పి ఎం చక్రధరకు సిఐటియు అనుబంధ సంఘం వివో ఏ ల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివోఏ లకు కనీస వేతనం వర్తింపచేయాలని కొత్తగా వచ్చిన యాప్లను రద్దు చేయాలని పని భారం తగ్గించాలని వేతనాలు కూడా సకాలంలో వారి అకౌంట్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు వివో ఏ లకు సీసీలు సహకరించాలని గ్రూపుల మధ్య సమస్యలు ఉన్న వెంటనే సిసిలు సమావేశాలు ఏర్పాటు చేసి పరిష్కరించాలని గ్రూపు బాధ్యతలు వాట్సాప్ బాధ్యతలు వారే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివో ఏల సంఘం నాయకులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రకం కంది విత్తనాలను ఉపయోగించండి

- **పొలం పిలుస్తోంది కార్యక్రమం: వ్యవసాయ అధికారి రాజు**

**తొండూరు మన జనప్రగతి ఆగస్టు 04:**-మండల పరిధిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గుండ్లమడుగు,సైదాపురం గ్రామాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే.రాజు మాట్లాడుతూ ఎల్లినో ప్రభావం దృష్ట్యా తక్కువ నీటిని తీసుకునే పంటలను సాగు చేయాలని రైతులకు తెలియజేశారు.అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన 15 తేదీ వరకు పొడిగించడం జరిగిందని ఇంకా ఎవరైనా రైతులు ఇన్సూరెన్స్ చేసుకోకుండా ఉన్నట్లయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనవలెనని ఈ పంట ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసినటువంటి ప్రతి పంటను తమ ఆర్ఎస్కే సిబ్బంది ద్వారా ఈ పంటలో నమోదు చేసుకోవాలని కార్యక్రమంలో భాగంగా నూతన కంది వెరైటీలు అయినటువంటి ఎల్ ఆర్ జి 150, 133-33 వంటి రకాలను రైతులందరూ వేసుకోవాలని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ రైతులకు తెలియజేయడం జరిగింది.ఈ నూతన కంది రకాలు కావాలంటే మీ పరిధిలోని రైతు సేవా కేంద్రానికి లేదా మండల అగ్రికల్చర్ కార్యాలయం ను సంప్రదించవలెను ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏ టీ ఎం తరుణ్ చంద్రారెడ్డి ,సెరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ రామ్మోహనరావు, హుస్సేన్,సుదర్శన్, గ్రామల రైతులు పాల్గొన్నారు.



## అల్లాపూర్ డివిజన్‌లో అధ్వానంగా మారిన రోడ్లు: అధికారులను నిలదీసిన బండి రమేష్



**కూకట్‌పల్లి మన జనప్రగతి ఆగస్టు 04:**కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దర్ నగర్ ప్రాంతంలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నాలుగు నెలల క్రితం ఇదే ప్రాంతంలో పాదయాత్ర చేసినప్పుడు గుర్తించిన సమస్యలే ఇప్పటికీ కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇ బ్లాక్ రోడ్డు నిర్మాణంలో జిహెచ్ ఎంసి,వాటర్ వర్క్స్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. వెంటనే కూకట్‌పల్లి జోన్ జిహెచ్‌ఎంసి అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన బండి రమేష్,రోడ్డు పనులను ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రారంభించాలని కోరారు. రోడ్డు పనులకు ఇప్పటికే నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంతో వర్షాకాలంలో ఇ బ్లాక్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మంజీరా పైప్‌లైన్ పనులను సాకుగా చూపుతూ రోడ్డు పనులు నిలిపివేయడం సరికాదని, అవసరమైతే వాటర్ వర్క్స్ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించి వెంటనే పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బండి రమేష్ పర్యటన సందర్భంగా స్థానిక కాలనీవాసులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల అవసరాలను బట్టి అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో అల్లాపూర్ వాజీద్ పాషా, అబ్దుల్లా, లక్ష్మణ్ గౌడ్, సాయి తులసి, రేష్మ, లక్ష్మి, రాము, రాంబాబు, శంకర్, నరసింహ, నరసింహ యాదవ్, వేణు, సతీష్‌తో పాటు స్థానిక కట్టమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## దివిసీమ గాంధీ' మండలి వెంకట కృష్ణారావు గారి జయంతి వేడుకలు



**కడప టౌన్ మన జనప్రగతి ఆగస్టు 04:-** తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు, అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రముఖ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మండలి వెంకట కృష్ణారావు గారి జయంతి సందర్భంగా వై.ఎస్.ఆర్ కడప జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు పాల్గొని కృష్ణారావు గారి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ.. 1926 ఆగస్టు 4వ తేదీన కృష్ణా జిల్లా కైకలూరులో జన్మించిన మండలి వెంకట కృష్ణారావు గారు తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి అభివృద్ధికి విశేష కృషి చేశారని, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రిగా ఆయన అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలు పొందారన్నారు. 1955లో ప్రారంభించిన బంజరు భూముల పంపిణీ కార్యక్రమం ద్వారా 15,000 ఎకరాల భూమిని దివిసీమలోని పేదలకు పంచారని తెలిపారు. 1969లో అవనిగడ్డలో "గాంధీక్షేత్రం"ను స్థాపించి, అక్కడ గ్రంథాలయం, మహిళా మండళ్లు, చరఖా శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. 1975లో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత వారిదన్నారు. దివిసీమ ఉప్పెన సంభవించిన సమయంలో బాధితులను ఆదుకోవడంలో ముందుండి సేవలందించిన ఆయన, వేలాది కుటుంబాలకు అండగా నిలిచారని, ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా "దివిసీమ గాంధీ" అనే బిరుదును పొందారన్నారు. తెలుగు భాషాభివృద్ధి, తెలుగు సంస్కృతి పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో మండలి వెంకట కృష్ణారావు గారు చేసిన కృషి భావితరాలకు ఆదర్శప్రాయమని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డి.ఎస్.పీ పి.నాగేశ్వర రావు , ఆర్.ఐ లు సోమశేఖర్ నాయక్, పెద్దయ్య, టైటస్, శివరాముడు ఆర్.ఎస్.ఐ లు వెంకటేశ్వర్లు, పావని, ఓబులేసు, సభాపతి, శ్రీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ముద్దాయికి రూ.5 వేల జరిమానా



**ప్రొద్దుటూరు టౌన్ మన జనప్రగతి ఆగస్టు 04 :-** వైఎస్సార్ కడప జిల్లా రాజుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన హత్యాయత్నం కేసులో ముద్దాయికి ప్రొద్దుటూరు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు రూ.5 వేల జరిమానా విధించింది. పోలీసుల వివరాల ప్రకారం, రాజుపాలెం మండలం పర్లపాడు గ్రామానికి చెందిన దుద్యాల చంద్రమహేశ్వర్ రెడ్డి, గంగిరెడ్డి జగన్మోహన్ రెడ్డి మధ్య ఇంటి గోడ వివాదంపై కొంతకాలంగా మనస్పర్ధలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2019 జనవరి 9న ఉదయం ఫిర్యాదుదారుడి భార్య నాగమణితో ముద్దాయి గొడవకు దిగాడు. ఆమెను ఎందుకు దూషిస్తున్నావని చంద్రమహేశ్వర్ రెడ్డి ప్రశ్నించగా, ముందుగానే తన వద్ద ఉన్న గొడ్డలితో తలపై దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై అప్పటి రాజుపాలెం ఎస్ఐ ఎం. శ్రీనివాసులు క్రైమ్ నంబర్ 04/2019 కింద భారతీయ శిక్షాస్మృతి (భాజ) సెక్షన్ 307 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. అనంతరం ముద్దాయిని అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన ప్రొద్దుటూరు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఫైజెన్నిసా ముద్దాయిపై నేరం రుజువైనట్లు నిర్ధారించి రూ.5,000 జరిమానా విధించారు. కేసులో ప్రభుత్వ తరపున సమర్థవంతంగా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి. గుర్రప్ప, దర్యాప్తు అధికారి అప్పటి ఎస్ఐ ఎం. శ్రీనివాసులు, సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరిచిన ప్రస్తుత ఎస్ఐ జి. ప్రణయ్ కుమార్ రెడ్డి, కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్ కానిస్టేబుల్ ఎన్. సంజీవ్ కుమార్, రాజుపాలెం పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ కె. వీరశేఖర్‌లను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, అభినందించారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన

- వైద్యాధికారిని డీడీఓ డాక్టర్,బొడ వినీత



**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 04:-**ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని అంగన్వాడి రెండవ సెంటర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీడీఓ డాక్టర్ బొడ వినీత ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా డా.బొడ వినీత మాట్లాడుతూ..ప్రసవం జరిగిన 30 నిమిషాల్లోపు బిడ్డకు తల్లి ఇచ్చే ముర్రుపాలు అమృతంతో సమానమని,అవి శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచి అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని తెలిపారు,తల్లి పాలకు ప్రత్యామ్నాయంగా పోతపాలు ఇవ్వడం వల్ల శిశువుకు అనారోగ్య సమస్యలు, అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని,అందువల్ల ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు,అలాగే బిడ్డకు పాలు ఇచ్చిన వెంటనే పడుకోబెట్టకుండా భుజంపై వేసుకుని తేపు వచ్చే వరకు వీపుపై మెల్లగా తట్టాలని, లేకపోతే పాలు ఊపిరితిత్తుల్లోకి వెళ్లి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంటుందని వివరించారు,బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని,ప్రతి ప్రసవం మధ్య కనీసం రెండు నుంచి మూడు సంవత్సరాల విరామం పాటించాలని సూచించారు,కుటుంబ నియంత్రణ కోసం తాత్కాలిక గర్భనిరోధక పద్ధతులను వినియోగించాలని అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎన్.ఈశ్వరయ్య,హెల్త్ సూపర్వైజర్ రుక్మిణి,ఏఎన్ఎం భాగ్యశ్రీ,అంగన్‌వాడీ కార్యకర్త లీలావతి,ఆశా కార్యకర్తలు రంగావేణి,మధులత,శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీతో సీపీఐ పోరాట పంథా..!

- ప్రచార పాదయాత్రలకు వేంపల్లిలో శ్రీకారం
- ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీపీఐ పిలుపు



**వేంపల్లి మన జనప్రగతి ఆగస్టు 04:-**దేశ సమైక్యత, సమగ్ర అభివృద్ధి సాధనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ పోరాటానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా ఆగస్టు 6 నుంచి 15వ తేదీ వరకు ప్రచార పాదయాత్రలు నిర్వహించి, సెప్టెంబర్ 1న చేపట్టే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం వేంపల్లిలోని ఎస్టీయూ కార్యాలయంలో 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు, కార్మికులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను వ్యతిరేకిస్తూ, రైతులకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణతో కార్మికుల హక్కులకు భంగం కలుగుతోందని అన్నారు. వరుస పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమఉత్తరాంధ్ర ప్యాకేజీలు, పోలవరం పూర్తి, కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు అంశాల్లో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ప్రచార పాదయాత్రలు, సెప్టెంబర్ 1న జరిగే 'చలో ఢిల్లీ' కార్యక్రమంలో ప్రజలు, రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జకరయ్య, అంజి, రామాంజనేయులు, రూపకాంత్, మల్లేష్, చాంద్‌బాషా, రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీలో అక్రమాలు జరిగింటే జగన్ చర్చకు సిద్ధమా..!!

- మోకాలికి బోడి గుండుకు లంకె పెట్టి మాట్లాడడం వైకాపాకు తగదు
- ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 04:-** డీఎస్సీ పై వైకాపా నేతలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం అని, ఇందులో అక్రమాలు జరిగి ఉంటే వైకాపా అధినేత జగన్ చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ పులివెందుల టిడిపి ఇంచార్జి బీటెక్ రవి సవాల్ విసిరారు. వేంపల్లి లో మంగళవారం జరిగిన తెదేపా నేత,రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ కుమారుడు మహమ్మద్ సోహెల్ మల్లి పెళ్లి కార్యక్రమానికి హాజరైన వారు విలేకరులతో మాట్లాడారు. వైఎస్ఆర్సిపి పార్టీ డీఎస్సీ పై మోకాలికి బోడి గుండుకు లంకె వేసి మాట్లాడుతున్నారని వారు తెలిపారు. విద్యా వ్యవస్థలో దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో చేయని విధంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో సంస్కరణలు తీసుకురావడం జరిగిందని, కేవలం లోకేష్ ప్రతిష్టను రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వైసీపీ పార్టీ ఆరోపణలు చేస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో ఏదైనా తప్పు జరిగితే కొద్ది గంటల్లోనే అది బయట పడుతుందని ఇప్పుడున్న సోషల్ మీడియా కాలంలో ఎలాంటి చిన్న పొరపాటు జరిగిన ఇట్టే బయటపడుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని కూటమి పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేల ఉద్యోగాలు ఇచ్చి న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని దీన్ని స్వాగతించాల్సిన వైసీపీ పార్టీ నాయకులు డీఎస్సీలో అక్రమాలు జరిగాయని మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని మాట్లాడడం దారుణం అన్నారు. భవిష్యత్తు కాలంలో విడుదల చేసే జాబ్ క్యాలెండర్ను అడ్డుకోవాలని దురుద్దేశంతో వైసీపీ పార్టీ ప్రయత్నిస్తుందని అన్నారు. డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన 16 వేల మంది ని ఉద్యోగాల నుంచి తొలగించాలని జగన్మోహన్ రెడ్డి హైకోర్టులో పిల్ వేశారని, 16 వేల మందిని బజారున వేసి వికృత ఆనందానికి జగన్ మోహన్ రెడ్డి తెరలేపారన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ అయిందని, ఆ విషయంలో కేంద్ర ప్రభుత్వం కేంద్ర మంత్రి రాజీనామా కూడా చేయించారన్నారు. అక్కడ ఏదో జరిగితే దాన్ని మన రాష్ట్రంలో ఎప్పుడో జరిగిన డీఎస్సీ పై అక్రమాలు జరిగాయని ఇప్పుడు వైకాపా నేతలు పల్లవి పాడడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం పారదర్శకంగానే వ్యవహరించిందని, డీఎస్సీ పోస్టుల భర్తీలో ఎవరు డబ్బులు తీసుకున్నారు.. ఎక్కడ తీసుకున్నారు అనర్హులకు ఉద్యోగాలు ఎక్కడ వచ్చాయి..అన్న విషయమై ఆధారాలతో చర్చకు రమ్మని వైకాపా అధినేత జగన్ను చర్చకు ఆహ్వానించామని ఈ విషయంలో వైకాపా నేతలు లేనిపోనివి మాట్లాడుతూ ముందుకు రావడం లేదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ,తెదేపా నేత దిల్ మాంగే చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



## అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: మునిరాజా యాదవ్

**ఏర్పేడు, మన జనప్రగతి ఆగస్టు 04:-** అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొడుగు మునిరాజా యాదవ్ అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం అంజిమేడు, సీతారాంపేట, ఏర్పేడు గ్రామాల్లో నిర్వహించిన ఌఇంటింటికి టీడీపీఌ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, 'తల్లికి వందనం' వంటి పథకాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాధవరం పీహెచ్‌సీ ఆవరణలో చెత్త పేరుకుపోవడంతో రోగుల ఆందోళన



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 04:-**మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే అనారోగ్యంతో చికిత్స కోసం వచ్చే వారికి ఈ పరిస్థితి మరిన్ని వ్యాధులు సోకే ప్రమాదాన్ని పెంచుతోందని రోగులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని వారు వైద్యశాఖ అధికారులను కోరారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్యను వివరణ కోరగా, ఆసుపత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

## తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక

**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 04:-** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని ఐపిఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీల అన్నారు. మంగళవారం నారాయణగూడ లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపిఎం) ప్రాంగణంలోని దుర్గాదేవి ఆలయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని బోనాల వేడుకలను ప్రారంభించి ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాస్ రావు, ముజీబ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎం. సత్యనారాయణగౌడ్, రాసూరి జ్ఞానేశ్వర్, బంగ్లా సుశీల్, ఎం.శ్రీనివాస్ రావు, నవీన్ కుమార్, శ్రీకాంత్, మహేష్, ప్రదీప్, సంతోష్, నరేష్, ప్రశాంత్, డి.ప్రభాకర్, కన్నె రమేష్ యాదవ్, బల్వీర్, డాక్టర్ విజయశాంతి, డాక్టర్ ఉమా, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ సాయితేజ, జగన్మోహన్ మోహన్ రావు, డాక్టర్ రమా, శైలజ, ముకరాల చంద్రశేఖర్ గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, డాక్టర్ అయోషా, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సబిత, డాక్టర్ దివ్యకీర్తి, డాక్టర్ కలీల్, తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ ధరకు సన్న బియ్యం పంపిణీ

ఆదోని మన జనప్రగతి ఆగస్ట్ 04:-కర్నూలు జిల్లా ఆదోని రైతు బజార్‌లో సబ్సిడీ ధరకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్సీ బీటీ నాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమాపతి నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ, రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారునికి కిలో రూ.50 చొప్పున నెలకు 10 కిలోల సన్న బియ్యాన్ని ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం రైతు బజార్‌తో పాటు పట్టణంలోని ప్రధాన సూపర్ మార్కెట్లలో కూడా ఈ బియ్యాన్ని అందుబాటులో ఉంచామని, పేద, మధ్యతరగతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఉమాపతి నాయుడు,మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ శారద, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ రామకృష్ణ, టీడీపీ నాయకులు తిమ్మప్ప, శివప్ప, రంగస్వామి నాయుడు, జిందే శంకర్, గుడిసె శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
05- 08 - 2026

# అత్యధిక జనాభా ఉన్న యాదవులకు ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలి

**● జాతీయ యాదవ్ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ డిమాండ్**



**విజయవాడ మన జనప్రగతి ఆగస్టు 04:-** గవర్నర్ కోట కింద భర్తీ చేయనున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని యాదవ సామాజిక వర్గానికి కేటాయించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యాదవ సామాజిక వర్గం రాష్ట్రంలోని అతిపెద్ద వెనకబడిన వర్గాలలో ఒకటిగా ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో, పాడి పరిశ్రమలో అలాగే కూటమి ప్రభుత్వ అద్భుత విజయంలో యాదవ సమాజం క్రియాశీలక పాత్ర వహించిందని మేకల రాములు ఆ ప్రకటనలో తెలిపారు. టిడిపి పార్టీ అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న పార్టీ వెన్నుముకగా అధిక శాతం యాదవులు నిలిచారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు దాటుతున్న నేటికీ యాదవ సామాజిక వర్గానికి తగు ప్రాధాన్యత లభించలేదన్నారు. ఈ సమయంలో యాదవులకు ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలను యాదవులు కోల్పోయారన్నారు. లక్షలాది మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న యాదవ వర్గాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించడం సమంజసం కాదన్నారు. సామాజిక న్యాయం అంటే సంక్షేమ పథకాలు కావని సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కూడా అవసరమన్నారు. త్వరలో భర్తీ చేయనున్న రెండు గవర్నర్ కోట ఎమ్మెల్సీ స్థానాలలో యాదవ సామాజిక వర్గానికి తప్పనిసరిగా ఒక స్థానాన్ని యాదవ ప్రాతివిద్యం లేని జిల్లాలో యాదవ నాయకునికి కేటాయించవలసిందిగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కోరారు. యాదవ సమాజానికి ఒక ఎమ్మెల్సీ పదవి ఇవ్వటం అంటే ఒక వ్యక్తికి అవకాశం ఇవ్వటం కాదని, లక్షలాది మంది యాదవుల ఆత్మగౌరానికి, సామాజిక న్యాయానికి, రాజకీయ హక్కులకు గౌరవం ఇవ్వటమేనని మేకల రాములు పేర్కొన్నారు.

# నేడు బీసీ రక్షణ చట్టంపై కీలక భేటీ: మంత్రి సవిత



**అమరావతి మన జనప్రగతి ఆగస్టు 04:-**కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా బీసీ రక్షణ చట్టం తుది రూపు ఇవ్వడానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా విజయవాడలోని ఓ హోటల్ లో కీలక సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా, బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావడానికి చర్యలు ప్రారంభించామన్నారు. బీసీలను కులాలు, వృత్తుల పేరుతో దూషించినా, వారిపై దాడులకు, దౌర్జన్యాలకు దిగినా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా రక్షణ చట్టం రూపొందిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బీసీలపై జరిగే దాదాపు 15 రకాల దాడులు, వేధింపులను ఈ చట్టం కింద నేరాలు గుర్తిస్తామన్నారు. బీసీ రక్షణ చట్టంలో భాగంగా కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. గత సాధారణ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన తరవాత బీసీ రక్షణ చట్టం తీసుకొస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, ఇప్పటికే చట్ట రూపకల్పనకు పలు పర్యాయాలు కేబినెట్ లో ఉన్న ఎనిమిది మంది బీసీ మంత్రులు పలు పర్యాయాలు భేటీ అయ్యామన్నారు. భారత రాజ్యాంగానికి లోబడి పలు చట్టాలను పరిశీలించి, అధికారులు బీసీ రక్షణ చట్టానికి తుది రూపు తీసుకొచ్చారన్నారు. ఈ ముసాయిదా చట్టానికి తుది రూపు ఇచ్చే క్రమంలో బీసీ సామాజిక వర్గానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులతో కీలక భేటీ విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ లో బుధవారం నిర్వహించనున్నట్లు తెలిపారు.తనతో పాటు ఏడుగురు బీసీ మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్ సహా హోం మంత్రి అనిత, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కూడా హాజరుకానున్నారన్నారు. వారితో పాటు బీసీ సామాజిక వర్గానికి చెందిన 30 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు, ఆరుగురు ఎంపీలు ఈ సమావేశం పాల్గొననున్నట్లు తెలిపారు. వారిచ్చే సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుని బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇచ్చి, సీఎం చంద్రబాబునాయుడుకు అందజేయనున్నామన్నారు. బీసీల అభ్యున్నతికి, గౌరవ ప్రదమైన జీవనానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. దేశంలోనే బీసీలకు సంబంధించి ప్రత్యేక రక్షణ చట్టం తెస్తున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుందని మంత్రి సవిత తెలిపారు.

# ఖాతాదారుడికి షాక్..డిపాజిట్లపై హోల్డ్

**కెనరా బ్యాంక్ శాఖ మేనేజర్‌పై ఫిర్యాదు**

**న్యాయపరమైన ప్రక్రియ లేకుండానే చర్యలు తీసుకున్నారని ఆరోపణ**



From
Smt. P.G.Aruna, M.Sc, B.Ed.
Uravakonda Mandal,
Anantapuramu District.

To
The Bank Manager,
Canara Bank,
Uravakonda Branch.

Lr.No: A/201/2025, Date:31/07/2026

Sir,

Sub: Grievances – Ananthapuramu District – Guntakal Division – Uravakonda Mandal - received petition from Sri Malapati Srinivasulu, D.No.10-5-228 (Upstairs), Uravakonda – to stop hold/lein of bank account– Regarding.

Ref: Petition received on 27.07.2026 from Sri Malapati Srinivasulu S/o M.Ganganna, Uravakonda.

<<<>>>

It is to inform that a grievance has been received from Sri Malapati Srinivasulu, resident of Door No.10-5-228 (Upstairs), Uravakonda, stating that the applicant requesting the removal of the hold/lien marked on his Canara Bank account.

The applicant has stated that a hold/lien has been placed on his bank account, due to which he is unable to operate the account or utilize the available balance. He has requested the Bank authorities to verify the matter and remove the hold/lien, if found eligible, as per the applicable rules and procedures.

In view of the above, the petition is herewith forwarded for necessary verification and further action as per the rules in force. A copy of the applicant's petition is enclosed herewith for reference.

Encl: As above Applicant's Petition

Tahsildar,
Uravakonda Mandal.

Copy to
Sri Malapati Srinivasulu S/o M.Ganganna, D.No.10-5-228 (Upstairs), Uravakonda

T. PULA SEKHAR
Manager
SP No. 23290

Received Copy on 3/8/2026 @ 3:30pm

**ఉరవకొండ మన జనప్రగతి ఆగస్టు 04:-**ఉరవకొండ కెనరా బ్యాంకు శాఖ మేనేజర్‌పై సీనియర్ జర్నలిస్టు మాలపాటి శ్రీనివాసులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఫిర్యాదు చేశారు. ముందస్తు సమాచారం లేకుండా తన పొదుపు ఖాతా, వ్యక్తిగత స్థిర నిక్షేపాలపై నిలుపుదల విధించడం చట్ట విరుద్ధమని ఆరోపించారు.ఫిర్యాదు వివరాల ప్రకారం.. జూలై 24న తన ఖాతా నుంచి రూ.1 లక్ష నగదు తీసుకునేందుకు ప్రయత్నించగా, ఖాతాపై నిలుపుదల ఉన్నట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారని పేర్కొన్నారు. గడువు ముగిసిన స్థిర నిక్షేపం మొత్తాన్ని ఖాతాలో జమ చేసిన తర్వాత కూడా ఆ మొత్తంపై నిలుపుదల విధించారని తెలిపారు.శాఖ మేనేజర్‌ను సంప్రదించగా, శ్రీ హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్ రుణానికి తాను హామీదారునిగా ఉన్నందున ఈ చర్య తీసుకున్నట్లు వివరించారని చెప్పారు. తాను 65 ఏళ్ల వృద్ధుడినని, వైద్య అవసరాల కోసం నగదు అవసరమని తెలిపినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.2014లో మంజూరైన రుణం 2015లో మొండి బాకీగా మారిందని, ఇన్నేళ్ల తర్వాత ఎలాంటి న్యాయస్థాన ఆదేశాలు లేకుండా వ్యక్తిగత డిపాజిట్లపై నిలుపుదల విధించడం చట్టబద్ధతపై అనుమానాలు కలిగిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు.రుణానికి సంబంధించిన వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కోరినా ఇప్పటి వరకు అందించలేదని ఆరోపించారు. ఖాతా, డిపాజిట్లపై విధించిన నిలుపుదలకు సంబంధించిన ఆధారాలను ఇవ్వాలని, లేదంటే వెంటనే తొలగించి నిధులను వినియోగించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.సమస్య పరిష్కారం కాకపోతే రిజర్వ్ బ్యాంక్ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్‌ను ఆశ్రయిస్తానని తెలిపారు.

# వేంపల్లెలో ఘనంగా "మై భారత్" ప్రతిజ్ఞ,చైతన్య ర్యాలీ




**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 04:-** స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డా.కె.ఉషాశ్రీ అధ్యక్షతన "మై భారత్" అవగాహన కార్యక్రమం,ప్రతిజ్ఞ,చైతన్య ర్యాలీని మంగళవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రిన్సిపాల్ డా. కె. ఉషాశ్రీ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమైనదని, వికసిత భారత్ సాధన కోసం విద్యార్థులు 'మై భారత్' వేదిక ద్వారా జాతీయ సేవలో చురుగ్గా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని మై భారత్ కో-ఆర్డినేటర్ కె. రాజా రెడ్డి , ఎన్ ఎస్ ఎస్ వన్ - 1 కోఆర్డినేటర్ జనార్ధన మరియు ఎన్ఎస్ఎస్ - 2 కోఆర్డినేటర్ కుమార్ రాజా పర్యవేక్షించగా,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాజియా బేగం,అధ్యాపక బృందం నాగేంద్ర ,డాక్టర్ సతీష్,డాక్టర్ హరిత,మసూద్,వినోద్,ప్రసాద్,పిడి తేజేంద్ర,విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.బోధనా, బోధనేతర సిబ్బంది,విద్యార్థులందరూ జాతీయ సేవ, ఐక్యత, సామాజిక బాధ్యత కలిగి ఉంటామని "మై భారత్ ప్రతిజ్ఞ" చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణం నుండి విద్యార్థులు, సిబ్బంది కలసి భారీ చైతన్య ర్యాలీ నిర్వహించారు.విద్యార్థులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని,దేశభక్తి,యువజన సాధికారతపై నినాదాలు చేస్తూ పట్టణ పుర వీధుల్లో అవగాహన కల్పించి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# ఈఫిఎఫ్ కోసం విధులు బహిష్కరణ చేసిన పారిశుధ్య కార్మికులు

**● టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి చోరవతో విరమింపజేసిన ధర్నా**

**● విధుల్లో పారిశుధ్య కార్మికులు**




**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 04:-**వేంపల్లె పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు ఈఫిఎఫ్, జీతాలు చెల్లించాలంటూ విధులను బహిష్కరించారు. దీంతో వేంపల్లెలో చెత్త సేకరణ పనులు నిలిచి పోయాయ. మంగళవారం పారిశుధ్య కార్మికులు పంచాయతీ కార్యాలయం వద్ద విధులను బహిష్కరించి ధర్నా చేపట్టారు. పంచాయతీలో పారిశుధ్యం కార్మికులుగా పని చేసే సిబ్బందికి 36 నెలలు నుండి అధికారులు ఈఫిఎఫ్ చెల్లించలేదని దానికి తోడు 3 నెలల జీతాలు కూడ ఇవ్వలేదని పారిశుధ్య కార్మికులు అరోపించారు. ఈఫిఎఫ్, జీతాలు చెల్లించే వరకు పారిశుధ్య కార్మికులు విధులకు వెళ్లమని హెచ్చరించారు. జీతాలు రాక పోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయాని కార్మికులు వాపోయారు. పంచాయతీ అధికారులకు ఎన్నో సార్లు ఈఫిఎఫ్ చెల్లించాలని కోరిన కాలయాపన చేయడం వలన ధర్నా చేయాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు వాపోయారు. పారిశుధ్య కార్మికులతో ఎంపిడిఓ కుళాయమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ రమణయ్య లు కలిసి చర్చలు జరిపిన కార్మికులు జీతాలు, ఈఫిఎఫ్ చెల్లించే వరకు ధర్నా చేస్తామని హెచ్చరించారు. దీంతో ఏమిచేయలేని నిస్సహాయస్థితిలో ఎంపిడిఓ ఉండి పోయింది. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పారిశుధ్య కార్మికులతో చర్చలు జరపడంతో పాటు కార్మికులకు రావాల్సిన ఈఫిఎఫ్, జీతాలు చెల్లించేందుకు అధికారులతో మాట్లాడుతానని హామీ ఇవ్వడంతో కార్మికులు అందరూ ఒప్పు కున్నారు. దీంతో పారిశుధ్య కార్మికులు ముందే చరవాణి ద్వారా డిపిఓ రామచంద్ర రావు దృష్టికి ఈఫిఎఫ్, జీతాలపై తీసుకెళ్లి చర్చించారు. డిపిఓ రామచంద్ర రావు సెప్టెంబర్ నెల మొదటి వారంలో పారిశుధ్య కార్మికులకు రావాల్సిన 36 నెలల ఈఫిఎఫ్ ను చెల్లిచడం జరుగుతుందని డిపిఓ హామీ ఇచ్చారు. అలాగే రెండు నెలలు జీతాలు కూడ రెండు రోజుల్లోగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. టెక్నికల్ సమస్య వలన ఈఫిఎఫ్ తీసుకొలేదని చెప్పారు. ఈఫిఎస్ నిధులు 36 లక్షలు డిడి రూపంలో ఉన్నాయి. వారి డబ్బులు ఎక్కడికి పోలేదని తెలిపారు. టెక్నికల్ ప్రాబ్లమ్స్ పూర్తి అయిన వెంటనే ఈఫిఎఫ్ సమస్య లేకుండా చేస్తానని డిపిఓ హామీ ఇచ్చినట్లు తెలిపారు. డిసెంబర్ నెల జీతం మంజూరు చేస్తామని డిపిఓ హామీ ఇచ్చినట్లు తెలిపారు. డిపిఓ రామచంద్ర రావు, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి హామీ మేరకు ధర్నా విరమింప జేసి విధులకు హజరు అవుతామని పంచాయతీ అధికారులకు పారిశుధ్య కార్మికులు తెలిపారు. పారిశుధ్య కార్మికులు ధర్నా విరమింప జేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# నీటి లీకేజీపై నిద్రమత్తులో అధికారులు..

**● అంగన్‌వాడీ వద్ద కొనసాగుతున్న సమస్య ● చిన్నారుల భద్రత ప్రశ్నార్థకం**

**● ప్రజల ఆగ్రహానికి గురవుతున్న అధికారులు**



**వేముల మన జనప్రగతి ఆగస్టు 04:-**నీటి లీకేజీ సమస్య నెల రోజులుగా కొనసాగుతున్నా అధికారులు స్పందించకపోవడంతో అంగన్‌వాడీ చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.వేముల మండల కేంద్రంలోని స్థానిక యాదవ బజారు వద్ద అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా పైప్‌లైన్ నుంచి నిరంతరం నీరు కారుతూ రహదారిపై ప్రవహిస్తున్నప్పటికీ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.లీకేజీ నీటితో అంగన్‌వాడీ కేంద్రం ఎదుటి రహదారి పూర్తిగా జారుడుగా మారింది. దీంతో కేంద్రానికి వచ్చే చిన్నారులు,వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.జారుడు రోడ్డుపై పలువురు చిన్నారులు జారిపడుతున్నారని స్థానికులు తెలిపారు.వాహనదారులు,పాదచారులు కూడా అప్రమత్తంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.చిన్నారులు ప్రతిరోజూ రాకపోకలు సాగించే ప్రాంతంలో నెల రోజులుగా ఈ సమస్య కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా అంటూ సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ లీకేజీని మరమ్మతు చేయడంతో పాటు రహదారిపై నిలిచిన నీటిని తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.చిన్నారులకు ఎలాంటి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకుని అంగన్‌వాడీ కేంద్రం వద్ద సురక్షిత రాకపోకలు కల్పించాలని కోరుతున్నారు.

# ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ చైర్మన్‌గా బొంతు



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 04:-** ప్రజా ఆరోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కర్ రావు కాకినాడ జిల్లా అధ్యక్షునిగా బొంతు శ్రీనివాసరావుని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ బొంతు శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో సంఘాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా ఉద్యోగుల సమైక్యతతో పాటు అందర్నీ కలుపుకుంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ ఉద్యోగుల బలోపేతానికి కృషి చేస్తా నని తెలియజేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్లు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సిబ్బంది బొంతు శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో కె కిషోర్,రామారెడ్డి,పతాంజలి,పి వెంకటేశ్వరరావు, పి.సురేష్,నక్క ఆదిలక్ష్మి,జి.రమణమ్మ, తదితరులు శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు.

# కడప నగరానికి శాశ్వత తాగునీటి పరిష్కారం చూపాలి

**- అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య**



**కడప మన జనప్రగతి ఆగస్టు 04:-**కడప నగర ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం గండి ప్రాంతంలోని నీటి పంప్‌హౌస్,ఎండిపోయిన బావులను కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.మైలవరం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ గండికి నీరు చేరలేదన్నారు. పెన్నా నదిపై లింగంపల్లి వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో రూపొందించిన సోమశిల బ్యాక్‌వాటర్ తాగునీటి ప్రణాళికను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ నాయకులు కమల్ బాషా,దాసరి శ్రీనివాసులు, పాల్ సుధాకర్, శీలం గంగయ్య, షమీర్ హుస్సేన్, షేక్ జబీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాల వారీగా వ్యవసాయ రోడ్‌మ్యాప్‌లు: కేంద్రం

**ఢిల్లీ, మన జనప్రగతి ఆగస్టు 04:-**

రాష్ట్రాల వ్యవసాయ- వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక వ్యవసాయ రోడ్‌మ్యాప్‌లు రూపొందిస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ లోక్‌సభలో తెలిపారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ వివరాలు వెల్లడించారు.అస్సాం, గోవా, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, అండమాన్-నికోబార్ దీవుల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రైతుల ఆదాయం పెంపు, ఉత్పాదకత, వనరుల సమర్థ వినియోగం, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, గ్రామీణ ఉపాధి, వ్యవసాయ రంగం సుస్థిర అభివృద్ధే ఈ రోడ్‌మ్యాప్‌ల ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ICAR, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, నిపుణుల సహకారంతో ఈ ప్రణాళికలు రూపొందుతున్నాయని వివరించారు.



# సచివాలయం ఉంది..సేవలు ఎక్కడ..?

**అరకొరక సిబ్బందితో నత్తనడకన పనులు**

**ధ్రువపత్రాల కోసం ప్రజల ప్రదక్షిణలు**

**పథకం వస్తే నెట్ సెంటర్లకు పరుగులు**

**సేవల్లో జాప్యంపై పెరుగుతున్న అసంతృప్తి**




**పులివెందుల స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 04:–** గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ పులివెందుల నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో పనిచేస్తోందా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లోనే సేవలు అందుతాయని భావించిన ప్రజలు అనేక పనుల కోసం ఇప్పటికీ మీ సేవా కేంద్రాలు, ప్రైవేట్ నెట్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోందనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. పులివెందుల నియోజకవర్గంలోని గ్రామాల్లో సచివాలయాల ద్వారా సేవలు అందుతున్నప్పటికీ, కొన్ని చోట్ల సిబ్బంది కొరత, అదనపు బాధ్యతలు, సాంకేతిక సమస్యల కారణంగా సేవల్లో జాప్యం జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు అవసరమైన సమయంలో సంబంధిత సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల పనులు వాయిదా పడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

### అరకొరక సిబ్బంది..అంతంత మాత్రంగానే సేవలు

కొన్ని గ్రామ సచివాలయాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ఖాళీలు,అదనపు బాధ్యతల కారణంగా సంబంధిత సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.ఒకే ఉద్యోగి అనేక బాధ్యతలు నిర్వహించాల్సి రావడంతో దరఖాస్తుల పరిశీలన, పత్రాల ధ్రువీకరణ, ఆన్‌లైన్ సేవల్లో జాప్యం జరుగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఒక పని కోసం వచ్చిన ప్రజలు సంబంధిత సిబ్బంది కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు.

### కులం,ఆదాయం పత్రాల కోసం తప్పని ఎదురుచూపులు

విద్యార్థులు,ఉద్యోగార్థులు, పేద కుటుంబాలకు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు అత్యవసరం. అయితే దరఖాస్తు చేసిన తర్వాత పత్రాలు అందే వరకు పలుమార్లు సచివాలయాలు, సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు.సాంకేతిక సమస్యలు, ధ్రువీకరణ ప్రక్రియలో ఆలస్యం కారణంగా పత్రాలు సకాలంలో అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ముఖ్యంగా విద్యా, ఉద్యోగ దరఖాస్తుల చివరి తేదీలు సమీపించినప్పుడు ఈ జాప్యం మరింత ఆందోళన కలిగిస్తోందని అంటున్నారు.

### మీ సేవలు,నెట్ సెంటర్లకే పరుగులు

సచివాలయ వ్యవస్థ ఉన్నప్పటికీ పలు ప్రభుత్వ సేవల కోసం ప్రజలు ఇప్పటికీ మీ సేవా కేంద్రాలు, ప్రైవేట్ నెట్ సెంటర్లపై ఆధారపడాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు, పత్రాల అప్‌లోడ్, వివరాల సవరణ కోసం నెట్ సెంటర్లకు వెళ్లడంతో ప్రజలకు అదనపు ఖర్చులు తప్పడం లేదని అంటున్నారు. గ్రామంలోనే సేవలు అందితే ఈ వ్యయభారం, ప్రయాణ ఇబ్బందులు తగ్గేవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### పథకం వస్తే నెట్ సెంటర్లకు పరుగులు

కొత్త ప్రభుత్వ పథకం ప్రకటించినా, దరఖాస్తుల నోటిఫికేషన్ విడుదలైనా ప్రజలు సచివాలయానికి కాకుండా నెట్ సెంటర్లకు వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు.పథకాలపై ముందస్తు సమాచారం, సరైన మార్గదర్శకత్వం అందిస్తే చివరి రోజుల హడావుడి తగ్గుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సచివాలయాల్లోనే దరఖాస్తు ప్రక్రియకు సహాయం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

### బీమా నమోదు కోసం అర్ధరాత్రి వరకు రైతుల పడిగాపులు

ఇటీవల పంటల బీమా ప్రీమియం చెల్లింపు, నమోదు సమయంలో పలువురు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరి తేదీ సమీపించడంతో నెట్ సెంటర్ల వద్ద గంటల తరబడి, రాత్రి వేళల్లో సైతం వేచి ఉండి రిజిస్ట్రేషన్లు చేయించుకున్న పరిస్థితులు కనిపించాయి.గ్రామస్థాయిలోనే ముందస్తు సమాచారం, నమోదు సహాయం అందించి ఉంటే రైతులకు ఈ ఇబ్బందులు తప్పేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.వ్యవసాయ పనులను పక్కనపెట్టి నెట్ సెంటర్ల వద్ద వేచి ఉండాల్సి రావడం రైతులకు అదనపు భారంగా మారిందని అంటున్నారు.

### సచివాలయం ఉంది..సేవలు ఎంతవరకు..?

సచివాలయాల్లో సిబ్బంది, సాంకేతిక సదుపాయాలు ఉన్నప్పటికీ అవసరమైన సమయంలో సేవలు ఎంత వేగంగా అందుతున్నాయనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఒకే పని కోసం పలుమార్లు కార్యాలయానికి రావాల్సి వస్తే ప్రజల సమయం, ప్రయాణ ఖర్చు వృథా అవుతోందని అంటున్నారు. వృద్ధులు, మహిళలు, రైతులు, దూర ప్రాంతాల ప్రజలు ఈ సమస్యతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.

### సేవల్లో వేగం పెంచాలి..ఖాళీలు భర్తీ చేయాలి

ఖాళీ పోస్టులను భర్తీ చేసి ప్రతి సచివాలయంలో అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఆన్‌లైన్ సేవలను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించి, ప్రభుత్వ పథకాలపై ముందుగానే సమాచారం అందించాలని అంటున్నారు. సేవలకు నిర్దిష్ట గడువు పాటించి ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

### ప్రజల ముంగిట పాలన..ఆచరణలో కనిపించాలి

గ్రామ సచివాలయాలు కేవలం కార్యాలయాలుగా కాకుండా ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే సేవా కేంద్రాలుగా మారాలని పులివెందుల నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు."సచివాలయం ఉంది.. కానీ అవసరమైన సమయంలో సేవలు అందుతున్నాయా..? అరకొరక సిబ్బందితో పూర్తిస్థాయి సేవలు ఎలా సాధ్యం..?" అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. సిబ్బంది కొరతను పరిష్కరించి, సేవలను వేగవంతం చేసి, ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

# ఎట్టకేలకు లింగాల కుడి కాలువకు నీటి విడుదల..

**30 రోజుల జాప్యంపై రైతుల ఆగ్రహం**

**రైతుల ఒత్తిడితోనే నీటి విడుదల జరిగిందా..?**



**లింగాల మన జనప్రగతి ఆగస్టు 04:–**లింగాల మండల పరిధిలోని కుడి కాలువకు ఎట్టకేలకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి సోమవారం అధికారులు నీటిని విడుదల చేశారు. గత నెల జూలై 1వ తేదీ నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో కాలువ పరిధిలోని గ్రామాల ప్రజలు,రైతులు తాగు, సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.**కమీషన్ల కోసమే 30 రోజుల జాప్యమా..?** కాలువలో జమ్ము తొలగింపు పనుల పేరుతో నీటి విడుదలను దాదాపు 30 రోజుల పాటు నిలిపివేశారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కాలువలో నీరు ప్రవహిస్తున్నప్పటికీ జమ్ము సమస్యను ముందుగానే ఎందుకు గుర్తించలేదని వారు ప్రశ్నిస్తున్నారు.ఎల్నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక ఇప్పటికే ప్రజలు, రైతులు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో కాలువకు నీటిని నిలిపివేయడం వల్ల తాగునీటితో పాటు పంటలకు కూడా నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.కాలువలో జమ్ము తొలగింపు కోసం కోటి రూపాయలకు పైగా నిధులు విడుదలైనట్లు తెలిసిందని, పనుల్లో పారదర్శకతపై అధికారులు స్పష్టత ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.నీటి విడుదలలో జాప్యం వెనుక స్వార్థ ప్రయోజనాలు ఉన్నాయంటూ కొందరు రైతులు ఆరోపణలు చేస్తున్నారు.చిత్రావతి డ్యామ్‌లో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ లింగాల కుడి కాలువకు నీటిని నిలిపివేయడం బాధ్యతారాహిత్యమని రైతులు విమర్శించారు. పులివెందుల బ్రాంచ్ కెనాల్‌లో నిరంతరం నీరు ప్రవహిస్తుండగా ఇక్కడ నీటి సరఫరా నిలిపివేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.**రైతుల ఆగ్రహమే నీటి విడుదలకు కారణమా..?** గత వారం రోజులుగా కుడి కాలువ పరిధిలోని ఎత్తిపోతల పథకాల కింద ఉన్న గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్య తీవ్రంగా మారింది. బోరు బావుల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో కనీస అవసరాలకు కూడా నీరు అందని పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలిపారు.లక్షల రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన అరటి పంటలు నీరు లేక ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నీటి విడుదలలో జాప్యంపై కొందరు రైతులు ఉన్నతస్థాయి ఇంజినీరింగ్ అధికారులను ఫోన్‌లో నిలదీశారని సమాచారం. కాలువకు వెంటనే నీటిని విడుదల చేయకపోతే నిరాహార దీక్ష చేపడతామని రైతులు హెచ్చరించినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. రైతుల నుంచి ఒత్తిడి రావడంతో ఉన్నతాధికారి స్పందించి సోమవారం నీటిని విడుదల చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలుస్తోంది.భవిష్యత్తులో కుడి కాలువకు నీటి సరఫరాను నిలిపివేస్తే ప్రజలు, రైతులతో కలిసి ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. తాగు, సాగునీటి సమస్య పునరావృతం కాకుండా అధికారులు ముందుచూపుతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

# తల్లిపాల వారోత్సవాలు..



**తొండూరు మన జనప్రగతి ఆగస్టు 04:–** మండల పరిధిలోని మల్లెల 2 అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి మాట్లాడుతూ తల్లిపాలు తల్లి, బిడ్డ ఆరోగ్యానికి అమూల్యమైన వరమని పేర్కొన్నారు. పుట్టిన గంటలోపే ముర్రుపాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు తొలి టీకాతో సమానమైన రోగనిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, రోజుకు 8 నుంచి 12 సార్లు బిడ్డ అవసరాన్ని బట్టి పాలివ్వాలని సూచించారు. తల్లిపాల వల్ల శిశువులో రోగనిరోధక శక్తి, మెదడు ఎదుగుదల మెరుగుపడటంతో పాటు అనారోగ్యాలు తగ్గుతాయని, తల్లులకు త్వరగా కోలుకోవడం, బరువు తగ్గడం, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని వివరించారు. పాలిచ్చే తల్లులు తగినంత నీరు తాగడంతో పాటు పప్పులు, ఆకుకూరలు, పాలు, పండ్లు, ధాన్యాలు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, గర్భిణీలు పాల్గొన్నారు

# పరారీలో ఉన్న నేరస్థులపై కేంద్రం ఉక్కుపాదం

**2019-2026 మధ్య 36 దేశాల నుంచి 274 మందిని భారత్‌కు రప్పింపు**

**న్యూఢిల్లీ, మన జనప్రగతి ఆగస్టు 04:–** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో 2019 నుంచి 2026 (జూలై వరకు) మధ్య 36 దేశాల నుంచి మొత్తం 274 మంది పరారీలో ఉన్న నేరస్థులను భారత్‌కు తిరిగి రప్పించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పరారీలో ఉన్న నేరస్థులను దేశానికి తీసుకురావడాన్ని మోదీ ప్రభుత్వం జాతీయ ప్రాధాన్యతగా తీసుకుని, చట్టపరమైన, దౌత్యపరమైన, సాంకేతిక చర్యలతో సమగ్ర వ్యూహాన్ని అమలు చేసినట్లు కేంద్ర సమాచార ప్రసార బ్యూరో (ౄ×దీ) విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.పరారీలో ఉన్న నేరస్థులపై చర్యలకు గ్లోబల్ ఆపరేషన్లు, పటిష్ట సమన్వయం, స్మార్ట్ దౌత్య విధానం అనే మూడు కీలక స్తంభాలపై ప్రభుత్వం పనిచేసిందని తెలిపింది. ఈ సమస్య దేశ సార్వభౌమాధికారం, ఆర్థిక స్థిరత్వం, శాంతిభద్రతలు, జాతీయ భద్రతతో ముడిపడి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నట్లు వెల్లడించింది.ప్రభుత్వం 2018లో ఫ్యూజిటివ్ ఎకనామిక్ ఆఫెండర్స్ చట్టాన్ని అమలు చేయగా, 2019లో ఎన్ఐఏ సవరణ చట్టం, యూఏపీఏ సవరణ చట్టాలను తీసుకొచ్చింది. 2024లో అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాల్లోని భారతీయ నాగరిక సురక్ష సంహిత సెక్షన్లు 355, 356 ద్వారా నిందితుడు విదేశాల్లో ఉన్నప్పటికీ గైర్హాజరులోనే విచారణ నిర్వహించే నిబంధనను తొలిసారిగా అమల్లోకి తీసుకువచ్చింది.ఇంటర్‌పోల్‌తో సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు 2025లో భారత్‌పోల్ పోర్టల్‌ను ప్రారంభించి, రాష్ట్రాలు, కేంద్ర దర్యాప్తు సంస్థలకు చెందిన 1,400కు పైగా యూనిట్లను అనుసంధానం చేసినట్లు పేర్కొంది. దీని ద్వారా సమాచార మార్పిడి సమయం 3 నుంచి 10 రోజులకు తగ్గిందని వెల్లడించింది.గత మూడు సంవత్సరాల్లో 401 మంది పరారీలో ఉన్న నేరస్థులపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపింది. 2022లో 40, 2023లో 100, 2024లో 107, 2025లో 112, 2026లో ఇప్పటివరకు 182 రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొంది.మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద 2019 నుంచి 2026 మధ్య పరారీలో ఉన్న నేరస్థులకు చెందిన రూ.17,874 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇదే కాలంలో ఆర్థిక నేరస్థుల నుంచి సహా మొత్తం రూ.18,762 కోట్లను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.ఆపరేషన్ త్రిశూల్ :– ద్వారా ఉపగ్రహ సాంకేతికత, డిజిటల్ ఫుట్‌ప్రింట్లు, ప్రొఫైల్ మ్యాపింగ్ ఆధారంగా విదేశాల్లో పేర్లు, గుర్తింపులు మార్చుకుని దాక్కున్న నేరస్థులను గుర్తించి వారి ఆచూకీ కనుగొన్నట్లు పేర్కొంది.2019 నుంచి 2026 వరకు భారత్‌కు రప్పించిన 274 మంది నేరస్థుల్లో హత్యలు, దోపిడీలు, హింసాత్మక నేరాలకు సంబంధించిన వారు 62 మంది, లైంగిక నేరాలు, పోక్సో కేసులకు సంబంధించిన వారు 53 మంది, సంఘటిత నేరాలు, గ్యాంగ్‌స్టర్లు 42 మంది, ఉగ్రవాదం, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన వారు 17 మంది, మాదకద్రవ్యాల కేసులకు చెందిన వారు 16 మంది, మానవ అక్రమ రవాణా, కిడ్నాప్ కేసులకు సంబంధించిన వారు 18 మంది, ఆర్థిక నేరస్థులు 9 మంది, ఇతర కేసులకు చెందిన వారు 45 మంది ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.పరారీలో ఉన్న నేరస్థులను భారత్‌కు తీసుకురావడంలో ఐబీ, సీబీఐ, రా, ఎన్ఐఏ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఎన్‌సీబీ, డీజీజీఐతో పాటు రాష్ట్ర పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేశాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. దీంతో బాధితులకు వేగంగా న్యాయం అందించడమే లక్ష్యంగా "హోల్ ఆఫ్ గవర్నమెంట్" విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించింది.



PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174